

జీవించేందుకే మనిషి తినాలి

సమాజ సంక్షేమానికి జీవించాలి

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 317 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 31-05-2025 | పేజీలు : 6

# అమరావతికి ఆహ్వానం

- రండి.. పరిక్షించండి.. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి..
- ఢిల్లీ సీఐఐ వార్షిక సదస్సులో పారిశ్రామిక వేత్తలకు సీఎం చంద్రబాబు ఆహ్వానం
- రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించిన ఏపీ సీఎం
- అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపు
- 2026 జనవరికి అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ సిద్దమని ప్రకటన
- ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉత్పత్తుల తయారీకి పారిశ్రామిక వేత్తలు సిద్ధం కావాలన్న చంద్రబాబు
- సీఎం సమాధానాలపై పారిశ్రామిక వేత్తల హర్షం.. స్టాండింగ్ ఓవేషన్ తో గౌరవించిన సీఐఐ ప్లీనరీ.



**ఢిల్లీ, మే 30 (జనస్వరం) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఢిల్లీ వేదికగా జరిగిన సీఐఐ వార్షిక సదస్సులో పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఆర్థికాభివృద్ధి – సుస్థిరత – ఆంధ్రప్రదేశ్ బ్లూప్రింట్ అనే అంశంపై సీఐఐ స్పెషల్ ప్లీనరీ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఇదే సందర్భంలో పారిశ్రామికవేత్తలు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడులకు ఉన్న అవకాశాలు.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు.. రూపొందించిన విధానాలను సీఎం వివరించారు. స్వర్ణాంధ్ర విజన్ –2047లో పారిశ్రామిక భాగస్వామ్యాన్ని కోరుతున్నట్టు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. "ప్రస్తుతం సీబీఎన్ అనే బ్రాండ్ ద్వారా ఏపీకి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాం. క్రెడిబిలిటి అనేది రాత్రికి రాత్రి వచ్చేది కాదు. ఏపీకి రండి.. పరీక్షించండి.. ఆ తర్వాతే పెట్టుబడులు పెట్టండి. 2026 దేశంలోనే మొదటి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ అమరావతిలో ఏర్పాటు అవుతుంది. దీన్ని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలి. క్వాంటం కంప్యూటింగ్ విస్తృతం అవుతోంది. డ్రోన్స్, ఐఓటీ, సెన్సార్లు ఇలా వివిధ రకాల సాంకేతికతతో రియల్ టైమ్ డేటా అందుబాటులోకి వస్తోంది. ప్రస్తుతం ఈ రంగాల్లో పెట్టుబడిదారులు అవసరం. భవిష్యత్తులో ఈ రంగానికి మంచి డిమాండ్ ఉంది. దీనికి అమరావతి కేంద్రం కానుంది. టీసీఎస్,ఐబీఎం,ఎల్ అండ్ టీ సంస్థలు సంయుక్తంగా అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పుడు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నదే మా నినాదం. బీపీసీఎల్ రిఫైనరీ రామాయపట్నం వద్ద వస్తోంది. డేటా సెంటర్ , అనలటిక్స్ తో కూడిన క్యాంపస్ విశాఖలో ఏర్పాటు చేయాలని గూగుల్ ను ఆహ్వానించాం. పారిశ్రామిక వేత్తలు ఎవరు వచ్చినా వారికి ఎర్రతివాచీతో ఆహ్వానం పలుకుతాం. ధరఖాస్తు పెట్టినప్పటి నుంచి భూ కేటాయింపు, ఇతర అనుమతులివ్వటం మా బాధ్యత. రికార్డు టైములోనే అన్ని క్లియరెన్సులు ఇస్తామని మీకు హామీ ఇస్తున్నాం. ఏపీలో ఇప్పుడు సౌర,పవన,పంప్డ్ ఎనర్జీ లాంటి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి కేంద్రంగా మారుతోంది. పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఈ రంగాల్లో వస్తున్నాయి. రాయలసీమలో కొత్తగా హైటెక్ ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం. ఐదు లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తెచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతిలో ఫ్యూచర్ లీడర్లను తయారు చేయడం కోసం గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ను అమరావతిలో ఏర్పాటు చేస్తున్నాం." అని చంద్రబాబు పారిశ్రామిక వేత్తలకు వివరించారు.

**నాడు.. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రమోట్ చేయడమే నా అజెండా..**

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఏపీని ప్రమోట్ చేసిన విషయాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. "దావోస్ లాంటి చోట్లకు వెళ్తే ఓట్లు రావు కొందరు చెప్పారు. ఉమ్మడి ఏపీకి పెట్టుబడులు తేవాలనే లక్ష్యంతో ఓట్ల గురించి పట్టించుకోకుండా నేను ధైర్యం చేసి వెళ్లాను. 1995 నుంచి నిరంతరం దావోస్ లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరు అవుతునే ఉన్నా. ప్రజా జీవితంలో ఉన్న వారు ప్రజల సంపద పెంచడానికి చూడాలి. సంపద పెరిగితేనే ప్రజలకు తిరిగి ఇవ్వగలం, సంపద సృష్టిస్తేనే సంక్షేమ పథకాలు అమలు చేయగలం. నాడు హైదరాబాదులో సీఐఐ సహకారంతో ఓ గ్రీన్ బిల్డింగ్ ను నిర్మించగలిగాం. సీఐఐ భాగస్వామ్యంతో పెట్టుబడుల సదస్సులు చాలా సార్లు నిర్వహించగలిగాం. హైదరాబాద్ ఇప్పుడు అగ్రస్థానంలో ఉంది. దేశంలోనే అత్యంత ఎక్కువ తలసరి ఆదాయంగా ఉన్న నగరంగా ఉంది ఆదాయం సమకూరుస్తోంది. నేను పరిశ్రమల్ని ప్రోత్సహించే వ్యక్తిని సీఐఐ నుంచి ఒక పరిశ్రమ– పెట్టుబడి వచ్చినా మాకు మంచిదే. 1991లో మనం ఆర్థిక సంస్కరణలు మొదలు పెట్టాం. ఆ సమయంలో తప్పనిసరిగా కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చింది. ఈ విషయంలో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావును కూడా నేను అభినందిస్తాను. 1990 తర్వాత సమాచార విప్లవం, ఇంటర్నెట్ విప్లవం మొదలైంది. ఏపీలో నాడు తీసుకున్న సంస్కరణల వల్ల ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా ఐటీ నిపుణుల్లో 30 శాతం మంది తెలుగువారే కనిపిస్తారు. సాంకేతికతను అందిపుచ్చుకున్న తెలుగు ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించారు. ఇది నేను అరెస్టైన సమయంలో 80 దేశాల్లో పని చేసే ఐటీ ఉద్యోగులు వీధుల్లోకి వచ్చారు. అప్పుడే తెలుగువారు ఇన్ని దేశాల్లో పని చేస్తున్నారని ప్రపంచానికి తెలిసింది. ఇప్పుడూ అదే పని ఉన్నా.. విభజన ఆంధ్రప్రదేశ్ ను ప్రమోట్ చేస్తున్నా. హైదరాబాదును అభివృద్ధి చేసిన నాకు ఇప్పుడు అమరావతి రాజధాని నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చింది. ఓ గ్లోబల్ గ్రీన్ సిటిగా అమరావతిని నిర్మిస్తున్నాం. ఇందులో పరిశ్రమలు భాగస్వామ్యం కావాలని కోరుతున్నాం. వచ్చే 22 ఏళ్లకు ఇప్పుడే ప్రణాళికలు చేస్తున్నాం. 15 శాతం వృద్ధి రేటు సాధించటమే మా లక్ష్యం. మిడిల్ ఇన్ కమ్ గ్రూప్ కు మాత్రమే పరిమితం కాకూడదు. తలసరి ఆదాయాన్ని రూ.55 లక్షలకు చేర్చాలన్నదే మా విజన్. ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాం.

**ప్రపంచంలో అగ్రభాగాన భారత్..**

ప్రపంచంలో భారత్ ను ఆర్థిక శక్తిగా ఎదిగేలా ప్రధాని మోడీ చేసిన కృషిని.. తీసుకుంటున్న చర్యలను ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు వివరించారు. "భారత్ కు చెందిన పారిశ్రామికవేత్తలే ప్రపంచం మొత్తానికి సాంకేతిక సేవలు అందిస్తారనటంలో సందేహం లేదు. మన దేశానికి ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండడం అత్యంత సానుకూలమైన అంశం. ప్రస్తుతం 4 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఉంది. మరికొన్నేళ్లలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటాం. అప్పుడు మనకు పోటీయే ఉండదు. పాలనలో అత్యుత్తమమైన విధానాలు అవసరం అవుతాయి. మంచి విధానాలు ఉంటే భారత్ ను ఎవరూ చేరుకోలేరు. చైనా, అమెరికా లాంటి దేశాలు పోటీగా ఉన్నాయి. ప్రస్తుతం ఉత్పత్తుల నాణ్యతపై మనం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సి ఉంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో మన పరిశ్రమలు, ఐటీ ఉత్పత్తులు ఉంటేనే మనం రాణించగలం. గతంలో ఐటీని విస్తృతంగా ప్రోత్సహించాను. కేవలం బీపీఓ రంగానికే పరిమితం కాకుండా ఐటీ ఉత్పత్తులపై దృష్టి పెట్టి ప్రపంచానికి అందించాం. ప్రస్తుతం ఐటీ లేదా, ఇతర మాన్యుఫాక్చరింగ్ ఉత్పత్తుల విషయంలో ప్రపంచ శ్రేణి ప్రమాణాలను అందుకోవటంలో కొంత వెనుకపడి ఉన్నాం. దీన్ని అధిగమిస్తే మనల్ని ఎవరూ అందుకోలేరు. గతంలో ఎంట్రప్రెన్యూర్స్ అంటే ఆంధ్రాప్రెన్యూర్స్ అనే పేరుంది. ఇప్పుడు భారత్ ప్రజలంటేనే ఎంట్రప్రెన్యూర్ అనే పేరు వచ్చింది.సాంకేతికత పెరిగి వర్చువల్ గా పనిచేసే సంస్కృతికి అలవాటు పడుతున్నాం. గంటల ప్రాతిపదికన కూడా ఆదాయం వచ్చేలా ఉపాధి అవకాశాలు పెరిగాయి. సంపద సృష్టిలో స్టార్టప్ కంపెనీలు కీలకం. దీనికి అనుగుణంగా ఏపీలో విధానాలను రూపొందిస్తున్నాం.భారత్ కు ప్రస్తుతం అత్యుత్తమ సమయం – మోదీ లాంటి మంచి దార్శనిక నేత కూడా మనకున్నారు. రోటీన్ బిజినెస్ లు వద్దు.. థింక్ గ్లోబల్లీ, యాక్ట్ గ్లోబల్లీ, బిజినెస్ గ్లోబల్లీ అనేది మన విధానం కావాలని ఆకాంక్షిస్తున్నా.


**వివిధ ప్రశ్నలకు సమాధానమిస్తూ...**

సీఐఐ వార్షిక ప్లీనరీలో ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు.. జాతీయ స్థాయిలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఏపీలో ఏమేం చర్యలు తీసుకొంటున్నారన్న ప్రశ్నలకు సీఎం చంద్రబాబు సమాధానమిస్తూ.. "మనకు నైపుణ్యం ఉన్న మానవ వనరులు చాలా అవసరం ఉంది. దీనికి అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు అవసరం అవుతాయి. నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీలోనూ కొన్ని ఉత్తమ విద్య సంస్థలు వస్తున్నాయి. బిల్ గేట్స్ ఫౌండేషన్ తోనూ ఆరోగ్యం, వ్యవసాయం లాంటి అంశాలపై పనిచేస్తున్నాం. సాంకేతికత ఉంటేనే సరిపోదు దాన్ని క్షేత్రస్థాయిలో అమలు పరిస్తేనే ఫలితాలు వస్తాయన్నది నా విశ్వాసం. అందుకే ఏపీలో అత్యుత్తమ విధానాలను అనుసరిస్తున్నాం, ఏపీలో ఫలితాలు వస్తే దేశమంతా దాన్ని అనుసరించవచ్చు. టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ లాంటి వారి నుంచి ఆలోచనల్ని తీసుకుని నైపుణ్యాభివృద్ధి చేస్తున్నాం. పోలవరం ప్రాజెక్టు ను ఏపీలో నిర్మిస్తున్నాం, సముద్రంలోకి వృధాగా పోయే 2 వేల టీఎంసీల నీటి నుంచి 200 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రాజెక్టు నిర్మిస్తున్నాం. ఇది పూర్తి అయితే రాష్ట్ర సస్యశ్యామలం కావడంతో పాటు.. సంపద అందరికీ అందుతుంది. వంశధార నుంచి పెన్నా వరకూ నదుల్ని కూడా అనుసంధానించాలన్నది మా ప్రయత్నం. అలాగే సర్క్యులర్ ఎకానమీ దిశగానూ ఏపీలో ప్రణాళికలు చేపడుతున్నాం. స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ద్వారా సుస్థిర ఆర్థిక వ్యవస్థను సాధించాలన్నది మా ప్రయత్నం.ఏపీ ఇప్పటికీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రమే జీఎస్డీపీలో 35 శాతం వ్యవసాయం ద్వారానే వస్తోంది. అరకు కాఫీ ఇప్పుడు గ్లోబల్ బ్రాండ్ గా ఉంది . ఈ తరహా ఉత్పత్తులు ఉపాధిని సంపదను సృష్టిస్తాయి. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలతో పాటు పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాలంలో స్మార్ట్ వర్క్ అనేదే కీలకం, నైపుణ్యాలు పెంచుకోవటమే సరైన విధానం. గతంలో ఐటీ విప్లవం వచ్చినప్పుడు కూడా ఉద్యోగాలు పోతాయని అపోహ ఉండేది. పర్యాటక రంగంలో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నాం, ఎక్కువ సంఖ్యలో హోటళ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం. వచ్చే ఐదేళ్లల్లో 50 వేల హోటల్ రూంలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రతీ సమయంలోనూ సవాళ్లు, అవకాశాలు ఉంటాయి అందులో అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ఏపీని.. ఏపీలోని యువతను సిద్దం చేస్తున్నాం. అమరావతిలో పెద్ద ఎత్తున వివిధ నిర్మాణాలు జరగాల్సి ఉంది. నిర్మాణ రంగంతో పని చేయటానికి మేం సిద్ధం. వయబులిటి గ్యాప్ ఫండింగ్ వంటి విధానాల ద్వారా అభివృద్ధి, పీ–4–జీరో పావర్టీ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేలా కృషి చేస్తున్నాం.

**స్టాండింగ్ ఓవేషన్ తో సీఎంకు గౌరవం..**

సీఎం చంద్రబాబు చేసిన కీలక ప్రసంగానికి.. పారిశ్రామిక వేత్తలు అడిగిన వివిధ ప్రశ్నలకు సీఐఐ వార్షిక సదస్సు స్టాండింగ్ ఓవేషన్ తో గౌరవించింది. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు సంజీవ్ పురి తదితరులు చంద్రబాబును సత్కరించారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 31 మే 2025,

తిథి : శుద్ధ పంచమి (రా.08:19 వ.కు),

నక్షత్రం : పుష్యమి (రా.09:10 వ.కు),

బ్రహ్మ ముహూర్తం : తె.04:01ల తె.04:49,

రాహుకాలం : ఉ.08:51ల ఉ.10:28,

యమగండం : మ.01:42ల మ.03:19,

వర్జ్యకాలం : తె.05:19 తె.07:06

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 31 మే 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:31

సూర్యోదయం : ఉదయం గం. 05:49

జొహర్ : మధ్యాహ్నం గం. 12:18

అసర్ : సాయంత్రం గం. 03:41

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:46

ఇష : రాత్రి గం. 08:05




జన స్వరం

**విలేకరులు కావలెను**

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు

రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..

అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్

ఫోన్ నెం : 7013030690

మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ రాజకీయ వ్యూహంలో మార్పులు

### పవన్ పేరు ప్రస్తావనకు వెనుకడుగేంటి?

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. ఒకప్పుడు అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, 2024 ఎన్నికల్లో ఓటమిని చవిచూసింది. ఈ ఓటమి జగన్‌కు రాజకీయ పాఠాలు నేర్పినట్టుగా కనిపిస్తోంది. గతంలో మాటలతో ప్రత్యర్థులను విమర్శించడంలో పట్టు ఉన్న జగన్ ఇప్పుడు తన వ్యాఖ్యలపై స్వల్ప పరిమితులు విధించుకున్నట్టు స్పష్టమవుతోంది.

**జగన్ – రాజకీయ వ్యూహంలో మార్పు :**

పవన్ కళ్యాణ్ – గతంలో జగన్ తరచూ విమర్శించిన పేరు. వ్యక్తిగత స్థాయిలో ఆయన చేసిన వ్యాఖ్యలు, ముఖ్యంగా పవన్ వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద చర్చనీయాంశంగా మారాయి. మూడు పెళ్లిళ్లు, రాజకీయ అనుభవం లేని నాయకుడిగా పవన్‌ను వర్ణించిన జగన్, ఇప్పుడు ఆయన్ను ప్రస్తావించడానికే వెనకడుగేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇది జగన్ రాజకీయ వ్యూహంలో ఒక మేజర్ మార్పు అని చెప్పవచ్చు. గతంలో పవన్‌ను విమర్శించటం ద్వారా యువతలో తీవ్ర వ్యతిరేకత ఎదురైనట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు, యువతకు పవన్ కళ్యాణ్‌కు ఉన్న ఆదరణ, వైసీపీకి ఈ వర్గం దూరమవడంలో ప్రధాన కారణం అని చెబుతున్నారు. గాజువాక నియోజకవర్గంలో పార్టీ పరాజయం కూడా దీనికి సంకేతంగా కనిపిస్తోంది.

**పవన్ కళ్యాణ్‌పై రాజకీయ వ్యూహం – 2024 ఎన్నికల ప్రభావం :**

అన్నిటికీ ముందు, 2024 ఎన్నికల్లో వైసీపీకి ఎదురైన ఓటమికి కారణం, ముఖ్యంగా పవన్ కళ్యాణ్, కాపు వర్గం, యువత మరియు ఇతర సామాజిక వర్గాలు వైసీపీ నుండి దూరమవడం. గాజువాక వంటి కీలక నియోజక వర్గంలో వైసీపీ పరాజయానికి ఇది ప్రధాన కారణం. ఇక, వైసీపీకి లాభాలు చేకూర్చిన "పవన్ కళ్యాణ్"ను వ్యక్తిగతంగా ప్రస్తావించకుండా, తన విమర్శలను చంద్రబాబు నాయుడికి కేంద్రీకరించడం, జగన్‌కు వ్యూహాత్మక మాతృకగా మారింది.





**జగన్ ప్రత్యక్ష విమర్శలు చేయకపోవడం :**

ఇకపై జగన్ పవన్ కళ్యాణ్ పేరు ప్రస్తావించకుండా, చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌పై మాత్రమే విమర్శలు చేస్తున్న సందర్భంలో, ఇది రాజకీయ మేధా వ్యూహం అనే కోణంలో చూడవచ్చు. "రెడ్ బుక్" గురించి జరిగిన వివాదాలు, చంద్రబాబుపై చేయబడిన విమర్శలు, టీడీపీకి మోసాల సూత్రాలతో ఆరోపణలు – ఇవన్నీ, వైసీపీకి మద్దతుగా ఉన్న సామాజిక వర్గాలను సంతృప్తిపరచడానికి, అలాగే, కాపు వర్గం, యువత వంటి కీలక వర్గాల్ని తన వైపు తేవడానికి ప్రయత్నంగా కనిపిస్తున్నాయి.

**ఆశించిన విజయానికి అడ్డుకట్ట – పార్టీ అంతర్గత వివాదాలు :**

అయితే, ఈ మార్పులు జనంలో ఎంతవరకు ప్రతిస్పందన పొందగలవో అన్నది మరో ప్రశ్న. పార్టీలోని అంతర్గత వివాదాలు, ముఖ్యంగా వైసీపీ

## ఎడిటోరియల్

అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ సభ్యుల మధ్య పెరిగిన విభేదాలు, ఇప్పుడు జగన్‌తో కూడిన కొత్త వ్యూహాలను కూడా ప్రతిబంధకంగా నిలుస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ పట్ల ఉన్న వ్యూహాత్మక మార్పు, వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసే ఇతర రాజకీయ వర్గాల మద్దతు సాధించడంలో కీలకమైనదిగా నిలుస్తుంది.

**ముగింపు :**

ఈ మార్పులు చూస్తే జగన్ తన రాజకీయ వ్యవహార శైలిలో గణనీయమైన మార్పులు తీసుకువస్తున్నారని చెప్పవచ్చు. ఓటమి ద్వారా వచ్చిన రాజకీయ జ్ఞానోదయం, సమాజ వర్గాల సంక్లిష్టతపై అవగాహన మరింతగా పెరిగినట్టుగా స్పష్టమవుతోంది. రాజకీయాల్లో ప్రతిపక్షాన్ని విమర్శించడం ఒక భాగం కావచ్చు, కానీ విమర్శకు కూడా ఒక హద్దు ఉండాలని జగన్‌కు ఇప్పుడైనా తెలుసు అనే భావన రాజకీయ వర్గాల్లో ప్రచారం పొందుతోంది. ఇవి అన్నీ పరిశీలనలోకి తీసుకుని, జగన్ మళ్ళీ తన వ్యూహాన్ని రూపొందించుకుంటున్నారు. పాతతప్పులను సరిచేసుకుని, కొత్త వ్యూహాలు, కొత్త మార్గాలు అన్వేషించడం, ఆయన రాజకీయ భవిష్యత్తుకు మేలు చేయాలని అందరూ ఆశిస్తున్నారు.



జమ్ము సాయి కళ్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## అమరవీరుల త్యాగల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలి

- అమరవీరుడు నర్రా ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమంలో ?
సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపు



**పెదపాడు, మే 29 (జనస్వరం) :** అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం పెదపాడులో ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, అమరవీరుడు నర్రా ఆంజనేయులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆంజనేయులు సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా జోహార్లు అర్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎ.రవి మాట్లాడుతూ నర్రా ఆంజనేయులు ఉన్నత చదువులు చదువుకుని పీడిత ప్రజల కోసం పనిచేశారని, ఆయన ప్రాణత్యాగం తరతరాలకు గుర్తుండిపోతుందన్నారు. నాటి కమ్యూనిస్టులు త్యాగాలు ఫలితమే అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి మార్గం చూపాయని అయన చెప్పారు. నేడు డబ్బు రాజకీయాలు నడుస్తున్నాయని, అయినా కమ్యూనిస్టులు అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. దేశం,రాష్ట్ర అభివృద్ధి కోసం సీపీఎం, వామపక్షాలు చేస్తున్న ఉద్యమాలను అందరూ బలపరచాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలపై భారాలు వేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. శ్రీనివాస్, పి.రామకృష్ణ, గ్రామ నాయకులు షేక్ కరీముల్లా, షేక్ షఫీరా, గారపాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

## యోగాపై ఉపాధి కూలీలకు అవగాహన



**పులివెందుల, మే 30 (జనస్వరం) :** నియోజకవర్గంలోని వేంపల్లి మండలం నందిపల్లి అమృత సరోవరం వద్ద ఎంపీడీఓ కులాయమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధి కూలీలకు యోగ పై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామం మీద యోగా నిపుణులు రాజశేఖర్, గంగాధరల ఆధ్వర్యంలో ఆసనాలు వేయించార. అనంతరం కులాయమ్మ మాట్లాడుతూ యోగా అనేది మన దేశానికి వారసత్వంగా వస్తుందన్నారు. భారతీయ జీవన విదానంలో ఒక భాగం అని ఎంపిడివో తెలియజేశారు. ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత, దేహ దారుఢ్యం లభిస్తాయని డాక్టర్ వైద్యనాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలుర పాఠశాల పీడీ రాజశేఖర్, ఏపీ ఓ పార్వతి, నంది పల్లె పంచాయతీ కార్యదర్శి చరణ్ కుమార్, కత్తలూరు పంచాయతీ కార్యదర్శి శివకుమార్, కత్తలూరు సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## టిడ్కో సముదాయంలో లబ్ధిదారులకు ఫ్యాన్ల పంపిణీ



**చిలకలూరిపేట, మే 30 (జనస్వరం) :** వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చిలకలూరిపేటలోని టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు చేతుల మీదుగా ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పుల్లారావు, ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కుటుంబం సుఖంగా, సంతోషంగా జీవించేలా చూడటం తమ బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ప్రజల బాధలు చెరిగించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి చిన్న అవసరాన్ని గుర్తించి సకాలంలో స్పందించడమే ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిట్కో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫ్యాన్లు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే పుల్లారావుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ తక్షణమే ఆపాలి

- అమాయక గిరిజనులపై నక్సలైట్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మారణకాండ ఆపాలి
- మావోయిస్టులతో చర్చలు జరపాలి
- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో అఖిల పక్ష పార్టీల నాయకుల డిమాండ్




**ఏలూరు, మే 30 (జనస్వరం) :** ఆపరేషన్ కగార్ ఆపాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల అఖిలపక్షం ఆధ్వర్యంలో పాల్గొన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నక్సలైట్ల రహిత భారతదేశాన్ని 2026 నాటికి దేశ ప్రజలకు చూపిస్తామని చెబుతూ అడవి మీద ఆధారపడి జీవిస్తూ, అక్షర జ్ఞానం లేని అమాయకులైన గిరిజనులను అడవి నుండి దూరంగా తరలించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరిట అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని మోడీ అమిత్ షా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ మావోయిస్టులు కేంద్రంతో చర్చలకు సిద్ధమని బహిరంగంగా తెలియజేస్తున్న వారితో చర్చించకుండా వారిని చంపడం మానవ హక్కుల ఉల్లంఘన చేసినట్లేనని ఆపరేషన్ కగార్ కేంద్రం ఇప్పటికైనా నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన హక్కులను కాలరాస్తూ, గిరిజన చట్టాలను పాటించకుండా కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ పేరిట గిరిజనులపై మారణకాండ చేయడం ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోకపోతే కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమాయక ఆదివాసీలపై చేస్తున్న మరణ హోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని తద్వారా నక్సలైట్ల నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. నక్సలైట్లను నిర్మూలించే ప్రక్రియలో ఆదివాసీలపై మరణ హోమాన్ని జరపడం దారుణమని విమర్శించారు ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఏలూరు నగర కార్యదర్శి అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, ఎఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మందా క్రాంతి కుమార్, మెకానికల్ సంఘం కోశాధికారి కాటూరి శ్రీధర్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల కోసం, గిరిజనులపై జరుగుతున్న దాడులను నియంత్రించడం కోసం ఆపరేషన్ కగార్ నిలిపివేయడం కోసం జరిగే ప్రతి పోరాటానికి తమ సంఘాల మద్దతు ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు కురెళ్ల వరప్రసాద్, సీపీఎం అరుణతార నాగేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా ఆదివాసీలపై చేస్తున్న మారణకాండను తక్షణమే ఆపాలని, గిరిజన హక్కులను కాపాడాలని, వారి ప్రశాంత జీవనానికి భంగం కలిగించకుండా ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యులు మావూరి విజయ, తంగెళ్ళ మూడి శాఖ కార్యదర్శి ఎంఏ హకీమ్, 29వ డివిజన్ కార్యదర్శి గొర్లి స్వాతి,16వ డివిజన్ కార్యదర్శి కొల్లూరి సుధారాణి, లక్ష్మీ, భవాని, కొండేటి మేరి, ఖండ్రిక గూడెం కార్యదర్శి బాలిన కృష్ణ ప్రసాద్, కొండేటి రాంబాబు, లైసెన్స్ పోర్టర్స్ యూనియన్ అధ్యక్షులు తమ్మిశెట్టి రమణయ్య దాసిపల్లి ఆదినారాయణ, వేముల వెంకటేష్, సరస్వతి, పాల రామకృష్ణ, బేతా శంకర్, కాంగ్రెస్ నాయకులు కాటా మూర్తి, దండు బోయిన చంద్రశేఖర్, సేవాదళ్ సుబ్బారావు, ప్రసాద్, గ్రంధి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## ముత్తుకూరులో డొక్కా సీతమ్మ చలివేంద్రంలో కుండల అపహరణ

- స్వచ్ఛంద సేవకు విఘాతం
- చలివేంద్రాన్ని భంగపర్చిన దుండగులు




**ముత్తుకూరు, మే 30 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తితో సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ముత్తుకూరు సెంటర్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న మంచినీటి చలివేంద్రంలోకి దుండగులు చొరబడి, అక్కడ ఉన్న నీటి కుండలను అపహరించిన ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటన పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఈ చలివేంద్రం మా సొంత నిధులతో, శ్రామికులు, కార్మికులు, గిరిజనులు, పాదచారులకు వేసవి వేడిలో తాగునీరు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేశాం. అలాంటి మంచి పనిని భంగపర్చుడం బాధాకరం," అని సురేష్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.

**మళ్లీ ప్రారంభమైన సేవ :**

కుండలు చోరీకి గురైనప్పటికీ, సేవలో ఎలాంటి అంతరాయం కలగకుండా, నేడు కొత్త కుండలను తీసుకొచ్చి చలివేంద్రాన్ని మళ్లీ యధావిధిగా ప్రారంభించారు. "ఇది మా కష్టార్జితంతో చేస్తున్న సేవా కార్యక్రమం. దయచేసి మళ్లీ ఇలాంటివి జరగకుండా చూడండి. చేయలేని వారు అయినా మంచి పనికి అడ్డుపడకండి," అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం మండల నాయకులు పినిశెట్టి మహేష్, సందూరి శ్రీహరి, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, చిన్న, గిరీష్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిలో దాతల సహకారం ఎంతో అభినందనీయం

- కన్న తల్లిని, సొంత ఊరును అభిమానించే వారు ఎల్లప్పుడూ ఉన్నత స్థానంలో ఉంటారు
- దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి





**పెదపాడు, మే 30 (జనస్వరం) :** మండలంలోని వట్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ ధూళిపాల ఆదినారాయణ చౌదరి జ్ఞాపకార్థం వారి సతీమణి ధూళిపాల రాధాకుమారి ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన అసెంబ్లీ హాల్ ప్రాంగణాన్ని శుక్రవారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఇదే గ్రామంలో పుట్టి, ఇక్కడే విద్యను అభ్యసించి నేడు ఉన్నత స్థానాలను అధిరోహించిన ధూళిపాళ పాఠశాలలు భాను ప్రకాష్ వారి సన్నిహితులుతో కలిసి నార్త్ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని తెలి పారు. అదేవిధంగా వారి తండ్రి అయిన ధూళిపాళ్ల ఆదినారాయణ చౌదరి జ్ఞాపకార్థం వారి తల్లి ఆర్థిక సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసెంబ్లీ హాల్ ప్రాంగణాన్ని కూడా నూతనం గా నిర్మించి, ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలనే వారి ఆకాంక్షను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని, గ్రామాభివృద్ధిలో వారి సేవలు కొనసాగాలని కోరుతున్నట్లు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామ సీత, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు మరడానీ రవి, క్లస్టర్ ఇంచార్జ్ గుత్తా అనిల్ సహా పలువురు కూటమి నాయకులు, మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు జూన్ నెల ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ

**- 2,58,804 మంది ఫించన్ దారులకు రూ. 113.00 కోట్లు విడుదల**

**- స్పౌజ్ పెన్షన్ ల కింద మంజూరైన 2,967 పెన్షన్ల ను జూన్ 12వ తేదీ పంపిణీ.**



**ఏలూరు, మే 30 (జనస్వరం) :** ఎన్టీఆర్ భరోసా కింద ప్రభుత్వం అందించే జూన్ నెల పింఛన్లను ఈనెల 31నే లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ 1వ తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జూన్ నెలా పింఛన్ల పంపిణీ మే, 31 వ తేదీ ఉదయం 7.00 గంటలకల్లా ప్రారంభించాలన్నారు. మే 31 న ఫించన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి జూన్ 2వతేదీన పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పింఛన్లు ముందస్తు పంపిణీ విషయాన్ని లబ్దిదారులకు వ్యక్తిగతంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జూన్ నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లకు సంబంధించి 2,58,804 మంది ఫించన్ దారులకు రూ. 113. 00 కోట్ల ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వీలైనంతవరకు ఈనెల మే 31వ తేదీనే నూరుశాతం పంపిణీ పూర్తిచేసేలా అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలన్నారు. ఫించన్ పంపిణీకి నిర్ధేశించిన 5253 మంది సిబ్బంది తప్పకుండా మే 31వతేదీ ఉదయం 7 గంటలకు పెన్షన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. ఫించన్ పంపిణీలో ఎక్కడైనా ఏ ఒక్క పొరపాటు జరగకుండా ఫించన్లు పంపిణీ జరగాలని స్పష్టం చేశారు. అలాగే ఫించన్ దారులకు ఫించన్ తప్పకుండా ఇంటి వద్దనే ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో 300 మీటర్ల లోపు పంపిణీ చేయాలని, ఎ కారణం చేతనైన చెయ్యవలిసి వస్తే కారణం యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఫించన్ పంపిణీ సమయంలో ఎటువంటి అవినీతి జరిగినా క్రమ శిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఫించన్ దారులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారికి ఫించన్ పంపిణీ దారులకు ముందుగా నమస్కారం చేసి గౌరవం ఇవ్వాలని జిల్లా లోని అందరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, మునిసిపల్ కమిషనర్ ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే జూన్ నెల ఫించన్ పంపిణీ సమయంలో ప్రభుత్వ సందేశం తప్పని సరిగా వినిపించేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో స్పౌజ్ పెన్షన్ ల కింద మంజూరైన 2,967 పెన్షన్లను జూన్ 12న ప్రత్యేక కార్యక్రమం ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జూన్ నెల పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.విజయరాజు, జిల్లా పరిషత్ సిఇఓ, భీమేశ్వరరావు, జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి. నీలాద్రి, జిల్లా పంచాయతి అధికారి కె.అనురాధలను కలెక్టర్ ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

**భూమిపూజతో నిర్మాణ పనులకు శ్రీకారం**





**బొంరాస్‌పేట, మే 30 (జనస్వరం) :** మండలంలోని ఎర్రుమళ్ళ గ్రామంలో, ఇందిరమ్మ హౌసింగ్ పథకం కింద మంజూరైన ఇండ్ల లబ్ధిదారులకు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేష్ రెడ్డి శుక్రవారం మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ముగ్గు వేసి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ రెడ్డి మాట్లాడుతూ "ఇళ్లకు గృహనిర్మాణ అనుమతులు పూర్తయిన వెంటనే పనులు వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరలోనే తమ సొంత గృహాల్లో నివాసముండేలా చూస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వినోద్ గౌడ్, హౌసింగ్ డిఈ చందర్, ఏఈ వరుణ్, పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింలు గౌడ్, నాయకులు వెంకట్ రాములు గౌడ్, రామచంద్రారెడ్డి, అంజిల్ రెడ్డి, మల్లికార్జున్, మల్లేష్, పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, సిసి రామచంద్రయ్య, మండల మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, గ్రామ నాయకులు మొగులయ్య, జగన్నాథ్ రెడ్డి, చిన్న నర్సింలు, వెంకటయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి

**తపస్ నేతల డిమాండ్**





**బొంరాస్ పేట, మే 30 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డి.ఏ.ల (కరువు భత్యాలు)ను వెంటనే మంజూరు చేయాలని తపస్ సంస్థ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తపస్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకారం మల్లయ్య, బొంరాస్ పేట మండల ప్రధాన కార్యదర్శి బాకారం చంద్రశేఖర్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి ఆరు నెలలకొకసారి కేంద్ర ప్రభుత్వం ధరల సూచిక ఆధారంగా కేంద్ర ఉద్యోగులకు డి.ఏ.లు మంజూరు చేస్తోందని గుర్తుచేసిన వారు, అదే తీరులో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా కరువు భత్యం న్యాయంగా చెల్లించాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 26.39 శాతం డి.ఏ. జూలై 2022 నుండి అమలులో ఉందని, అయితే జనవరి 2023 నుంచి జనవరి 2025 వరకూ ఐదు డి.ఏ.లు పెండి ంగ్‌లో ఉన్నాయని తెలిపారు. అదనంగా సుమారు 15 శాతం కరువు భత్యం మంజూరు చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఈ బిల్లులను ట్రెజరీ వద్ద నిలిపివేసిందని, వాటిని విడుదల చేయకపోవడం ఉద్యోగుల్లో ఆందోళనను కలిగించిందని పేర్కొన్నారు. డి.ఏ.లు మంజూరు చేయడం తక్షణం జరగకపోతే ఉద్యమానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బొంరాస్‌పేటలో భారీగా ఇసుక డంపుల సీజ్

**శనివారం బహిరంగ వేలంపాట**



**బొంరాస్‌పేట, మే 30 (జనస్వరం) :** మండల పరిధిలోని దుప్చర్ల గ్రామ శివారులో శుక్రవారం భారీగా అక్రమ ఇసుక నిల్వలను అధికారులు సీజ్ చేశారు. ఈ దాడులు ఆర్ఐ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించినట్లు తహశీల్దార్ పద్మావతి తెలిపారు. వివరాల్లోకి వెళితే, గ్రామ శివారులోని బయన్న గుట్ట సమీపంలో నిల్వ ఉంచిన 44 ట్రాక్టర్లు, అనవోని శిరీష పొలం సమీపంలో ఉన్న మరో 8 ట్రాక్టర్లను అధికారులు గుర్తించి సీజ్ చేసినట్లు వెల్లడించారు. మొత్తం 52 ట్రాక్టర్ల ఇసుక నిల్వలను అధికార పర్యవేక్షణలో స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన ఇసుకను శనివారం ఉదయం 11 గంట లకు బహిరంగ వేలం ద్వారా అమ్మకానికి ఉంచనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. అక్రమ ఇసుక దం పులపై కొనసాగుతున్న దాడులతో స్థానికుల మధ్య చర్చనీయాంశంగా మారిన ఈ ఘటనలో మరిన్ని విచారణలు కొనసాగుతున్నట్లు సమాచారం.

## మామిడికాయల రక్షణకు సంచులు ఏర్పాటు



**చింతపల్లి, మే 30 (జనస్వరం) :** మామిడికాయలను కీటకాలు, పురుగులు, పక్షుల దాడుల నుంచి రక్షించేందుకు రైతులు సంచులను వాడుతున్నారు. ఈ విషయాన్ని పెంటపాడు గ్రామానికి చెందిన గిరిజన రైతు కంకిపాటి పెంటన్న పడాల్ వెల్లడించారు. అతని మాటల్లో సంచులతో మామిడి కాయ లను కప్పడం వల్ల ఈగలు, పురుగులు, ఇతర హానికర కీటకాలు మామిడి కాయలపై పడకుండా అడ్డుకట్ట వేయవచ్చు. అలాగే, పక్షుల దాడి తగ్గుతుంది. వర్షపు నీరు మామిడి కాయలను నేరుగా తాకకుండా ఉండటంతో పాడయ్యే ప్రమాదం తగ్గుతుందని చెప్పారు. ఈ విధానం వల్ల కాయలు సమానంగా పండుతూ, మెరుగైన రంగుతో మెరిసిపోతాయని, దాంతో మార్కెట్‌లో మంచి ధరలకూ విక్రయించవచ్చని ఆయన వివరించారు. అంతేకాక, రసాయన మందుల అవసరం తగ్గి, ఆరోగ్య కరమైన పండ్ల ఉత్పత్తి సాధ్యమవుతోందని పేర్కొన్నారు. ఈ కొత్త పద్ధతిని అనుసరిస్తూ చింతపల్లి మండలంలోని పెంటపాడు గ్రామానికి చెందిన రైతు మామిడికాయల సాగును విజయవంతంగా కొనసాగిస్తున్నారు. (ఈ చిత్రం జనస్వరం కెమెరాకు చిక్కింది.)

## చింతపల్లిలో ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు

**- హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ సర్వే ప్రారంభం**

**- అక్రమ దుకాణాల ఖాళీకి నోటీసులు**



**చింతపల్లి, మే 30 (జనస్వరం) :** ప్రభుత్వానికి చెందిన భూములు అక్రమంగా ఆక్రమించబడి సంవత్సరాలుగా వ్యాపార కార్యకలాపాలకు వేదికవుతున్న నేపథ్యంలో వాటిని రక్షించేందుకు రెవెన్యూ శాఖ కఠినంగా వ్యవహరించసాగింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాలపై స్పందించిన అధికారులు, శుక్రవారం చింతపల్లి మండల కేంద్రంలో సర్వే చేపట్టారు. మండల తహశీల్దార్ రామకృష్ణ నేతృత్వంలో రెవెన్యూ అధికారులు, హనుమాన్ జంక్షన్ కూడలి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను సర్వే చేసి కొలతలు వేశారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ భూములపై సంవత్సరాలుగా అనుమతి లేకుండా దుకాణాలు నిర్మించుకుని వ్యాపారం నిర్వహిస్తున్న పలువురు వ్యక్తులపై చర్యలు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది. అక్రమంగా నిర్మించబడిన ఈ దుకాణాల స్వాములకు ఇప్పటికే గతంలో పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, వారు స్పందించకపోవడంతో అధికారులు నేరుగా రంగానికి దిగి భూముల కొలతలు చేపట్టారు. త్వరలోనే ఈ దుకాణాలను ఖాళీ చేయించే దిశగా చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్టు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. కొలతల కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీ ట్రస్టులో అంతర్గత కలహాలు

**రహస్య సమావేశంతో ఉద్రిక్తత**



**చింతపల్లి, మే 30 (జనస్వరం) :** అల్లూరి సీతారామరాజు జిల్లా ఆదివాసీ ట్రస్టులో నెలకొన్న అంతర్గత విభేదాలు గర్వంగా సాగుతున్న సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేలా మారుతున్నాయి. తాజాగా ట్రస్టు సభ్యులు కొందరు చింతపల్లి మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని లింగాలగుడి గ్రామంలో రహస్యంగా సమావేశమవడం మన్యంలో కలకలం రేపింది. ప్రాథమిక సమాచారం మేరకు గత కొన్ని రోజులుగా ట్రస్టులో కొనసాగుతున్న వర్గ విభేదాలపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ సమావేశ విషయం ట్రస్టులోని మరో వర్గ సభ్యులకు తెలియడంతో వారు కార్లు, జీపులు, బైక్‌లతో ఆ గ్రామానికి చేరుకుని తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా ప్రవర్తించినట్లు సమాచారం. పరిస్థితి అదుపు తప్పే అవకాశాన్ని గుర్తించిన కొందరు సభ్యులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన అన్నవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ గుమిగూడిన ట్రస్టు సభ్యులను చెదరగొట్టి పరిస్థితిని శాంతియుతంగా చక్కదిద్దారు. ఇక ఈ ఘటనకు సంబంధించి మరో ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది. ఆదివాసీ ట్రస్టులో జరుగుతున్న లోపభూయిష్ట లావాదేవీలపై ట్రస్టు సభ్యులు అల్లూరి జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు పత్రాల నకళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ట్రస్టులో అసలు ఏమి జరుగుతుందన్న చర్చకు ఊతమిస్తూ, అధికారుల చర్యలపై ఉత్కంఠ నెలకొంది. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

## బురాన్‌పూర్ గ్రామంలో "టీబీ ముక్త అభియాన్"



**బొంరాస్‌పేట్, మే 31 (జనస్వరం) :** బురాన్‌పూర్ గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్ ఆధ్వర్యంలో జరగగా, ప్రజలకు టిబి వ్యాధి, రక్తపోటు, హెచ్ఐవి, ధూమపానం వంటి ఆరోగ్య సమస్యలపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్ర యాదవ్ మాట్లాడుతూ, "15 రోజులకు పైగా దగ్గు, ఛాతిలో నొప్పి, జ్వరం, బరువు తగ్గుట, ఆయాసం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పకుండా టీబీ పరీక్ష చేయించుకోవాలి" అని హితవు పలికారు. టీబీ బాధితులకు ప్రతి నెలా రూ.1000 పౌష్టికాహారం నిమిత్తం వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారని, అలాగే ఆరు నెలల పాటు ఉచిత మందులు అందజేయబడతాయని తెలిపారు. ఇతర వివరాల్లో భాగంగా, హెచ్ఐవి గ్రస్తులు కూడా తెమడ పరీక్ష చేయించుకోవాలన్నా సూచించారు. 100 రోజుల పాటు టిబి అవగాహన కార్యక్రమం, సర్వేలు, పేషెంట్లను గుర్తించి మందులు అందజేయడం లాంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ రాజు, హెచ్ఈ రాజేశ్వరి, ఐటీ శ్రీనివాస్, ఏఎన్ఎంలు లీలావతి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులందరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

**- ఏవో పొలప్ప**

**- రైతు యూనిక్ ఐడీ అవసరం**

**- ఆధార్, భూ వివరాలతో నమోదు చేయించుకోవాలని సూచన**



**బొంరాస్‌పేట, మే 30 (జనస్వరం) :** భూమి కలిగిన ప్రతి రైతు తన భూముల వివరాలతో కూడిన సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాల్సిన అవసరం ఉందని మండల వ్యవ సాయ అధికారి పొలప్ప పేర్కొన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతున్న ఆయన, రైతులకు ప్రత్యేక గుర్తింపు నెంబరు కేటాయించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రణాళికను చేపట్టిందని తెలిపారు. ఆధార్ కార్డు ద్వారా దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్టుగా, ప్రతి రైతుకూ 11 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య (యూనిక్ ఫార్మర్ ఐడీ)ను ఇవ్వాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిందని వివరించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుందన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యజమాన్య వివరాలను రైతు ఆధార్ కార్డుతో అనుసంధానించి ఈ ఫార్మర్ ఐడీ కేటాయిస్తారని తెలిపారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఈ రిజిస్ట్రేషన్ ఆధారంగా లబ్ధి అందుతుందన్నారు. మండల పరిధిలోని రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌తో లింకైన మొబైల్ నెంబరుతో కలిసి సమీప వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి తమ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

## ఇచ్చిన మాట నిలుపుకునేందుకే జీపీఓల నియామకం

**- సీఎంకు, రెవెన్యూ మంత్రికి ధన్యవాదాలు తెలిపిన లచ్చిరెడ్డి**

**- జీపీఓల పరీక్ష ఫలితాలు విడుదల పట్ల హర్షం**

**హైదరాబాద్, మే 31 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారమే గ్రామ పరిపాలన అధికారుల (జీపీఓ) నియామకం జరుగుతుందని తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామానికో అధికారిని నియమించబోతున్నారని తెలిపారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతంతో భూ సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుందన్నారు. జీపీఓల నియామకంతో రెవెన్యూ వ్యవస్థ కూడా బలోపేతం అవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి కృషి ఫలితంగానే ఇదంతా సాధ్యమైందన్నారు. జీపీఓల నియామకానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతంగా సాగుతుంది. అందులో భాగంగానే ఇటీవల జీపీఓల నియామకానికి పరీక్షను నిర్వహించారు. శుక్రవారం పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, జీపీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు గరికె ఉపేందర్ రావు, లక్ష్మి నరసింహా, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. భూ సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం చూపే లక్ష్యంతోనే రాష్ట్రంలో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తెచ్చిందని ఈ సందర్భంగా లచ్చిరెడ్డి పేర్కొన్నారు. భూ భారతిపై భూ యజమానులకు, రైతులకు, ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికే రెండు విడుతల సదస్సులు విజయవంతం అయ్యాయన్నారు. జూన్ 3 నుంచి జరిగే మూడో విడత సదస్సుల నాటికి జీపీఓలో విధుల్లో చేరే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్ల సంఘం సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ చౌహాన్, తెలంగాణ తహశీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మహిళా విభాగాల రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాధ, సుజాత చౌహాన్, జీపీఓ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## "మా బుద్ధుడు విగ్రహం మాకే కావాలి కలెక్టర్ అమ్మ"

**బోరిగాంలో మాల ప్రజల రాస్తారోకో**





**ముథోల్, మే 30 (జనస్వరం) :** నిర్మల్ జిల్లా ముథోల్ మండలం బోరిగాం గ్రామంలో బుద్ధుని విగ్రహం ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ముథోల్ వద్ద జాతీయ రహదారిపై మాల ప్రజలు రాస్తారోకో చేపట్టారు. దాదాపు నాలుగు గంటలపాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బుద్ధ విగ్రహం కోసం 18 రోజులుగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ లకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేకపోవడంతో ఛలో బోరిగాం కార్యక్రమాన్ని చేపట్టారు. బోరిగాం వెళ్లే మార్గంలో గేట్లు ఏర్పాటు చేయడంతో, వారు జాతీయ రహదారి వద్దే రాస్తారోకోకి దిగారు. ఈ విషయమై స్పందించిన జిల్లా ఎస్పీ జానిక షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్, ఆర్డీవో, అనంతరం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ఘటనాస్థలికి చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. భైంసా ఆర్డీవో మాట్లాడుతూ, బుద్ధ విగ్రహం స్థలం న్యాయ పరమైనదేనని, కలెక్టర్‌తో చర్చించి విగ్రహ ప్రతిష్టాపనకు అనుకూలంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, 16 కులాలకు చెందిన ప్రజలు నివసిస్తున్న గ్రామంలో అందరికీ విగ్రహాలు ఏర్పాటు చేస్తే స్థలం సరిపోదని, కేవలం రెండు గుంటల భూమి ఇవ్వాలన్న ప్రతిపాదనను మాల సంఘాలు ఖండించాయి. బుద్ధుని విగ్రహం ప్రతిష్టించేందుకు కనీసం రెండు ఎకరాల భూమి కేటాయించాలంటూ వారు డిమాండ్ చేశారు. ఆందోళన కొనసాగుతున్న సమయంలో, సోమవారం నాటికి అదే భూమిలో నీలి జెండా ఆవిష్కరణ చేస్తామని, తద్వారా తమ హక్కును ప్రదర్శిస్తామని మాల నాయకులు ప్రకటించారు. అధికారుల హామీతో రాస్తారోకోను విరమించినప్పటికీ, వాగ్దానం నెరవేర్చకపోతే మరోసారి భారీ స్థాయిలో ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఈ రాస్తారోకో సమయంలో పోలీసుల భారీ బందోబస్తు కారణంగా జాతీయ రహదారి వద్ద కిక్కిరిసిన వాహనాలు, ఉద్రిక్త వాతావరణం నెలకొన్నాయి.

## పునాదులకే పరిమితమైన జడుగూరు పాఠశాల భవనం

### ఏడేళ్లుగా నిలిచిన నిర్మాణం.. చెట్ల కింద చదువుతున్న విద్యార్థులు



**చింతపల్లి, మే 30 (జనస్వరం) :** పాఠశాలలు లేని గ్రామాలు.. చెట్ల కింద బోధన.. ఇది ఏడు దశబ్దాలు పూర్తి చేసుకుని డిజిటల్ యుగంలో కొనసాగుతున్న గ్రామీణ విద్యార్థుల వైఫల్య దృశ్యం. చింతపల్లి మండలానికి చెందిన కుడుముసారి పంచాయతీ పరిధిలోని జడుగూరు గ్రామంలో విద్యార్థులు శాశ్వత భవనం లేక విద్యను చెట్ల కింద అభ్యసించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. సరిగ్గా ఏడేళ్ల క్రితం ఈ గ్రామానికి పాఠశాల భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి పునాదులు వేసిన తర్వాత, పనులను చేపట్టిన గుత్తేదారుడు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్మాణం అక్కడితోనే ఆగిపోయింది. ఫలితంగా, విద్యార్థులు గాలి, వాన, ఎండ తట్టుకుంటూ చెట్ల కింద బోధన కొనసాగిస్తున్నారు. నిరంతరం ఈ స్థితిలో విద్యను కొనసాగించాల్సి రావడంతో, ఉపాధ్యాయులు కూడా తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. కట్టడం లేకపోవడం వల్ల పాఠశాల పాఠ్యసామగ్రి, రికార్డులు భద్రంగా ఉంచడం కష్టంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్క భవనం లేకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు ప్రభావితమవుతున్నాయని, విద్యార్థుల హాజరుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వారు చెబుతున్నారు. విద్యకు హక్కు ఉంది అంటున్నారు. కాని భవనం కూడా ఉండాలి కదా...? అంటూ గ్రామస్థులు వాపోతున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇలా జరిగింది కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణలోకి తీసుకుని నిర్మాణాన్ని పునఃప్రారంభించాలంటూ వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక నిర్లక్ష్యంతో విద్యార్థుల భవిష్యత్ బలైంది. అయిన ఎవరికీ బాధ్యత లేదన్న భావన తప్పని రీతిగా ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామస్థులు సంబంధిత అధికారులను కలిసినట్టు సమాచారం. నిర్మాణాన్ని పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రాలు సమర్పించారు. ఈ అంశంపై స్థానిక అధికారులు స్పందించి, నిర్లక్ష్యానికి పాల్పడిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకొని, పునాదులలో నిలిచిపోయిన పాఠశాల భవనం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## శక్తి వేల్ సుబ్రహ్మణ్యేశ్వర సహిత కాలభైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు దంపతులు



**అచ్యుతాపురం, మే 30 (జనస్వరం) :** మండలంలో ఎస్సీ జడ్పీ కాలనీ దిబ్బపాలెంలో ఐశ్వర్య సర్వదేశ్వర ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శక్తి వేల్ సుబ్రహ్మణ్యేశ్వర సహిత కాల భైరవ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ దంపతులు పాల్గొని స్వామివారి విగ్రహాలు ప్రతిష్టించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులతో అర్చకులు హెరీమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బైలపూడి శ్రీరామదాసు, రాజాన సన్యాసినాయుడు, జనపరెడ్డి శ్రీనివాసరావు ద్వారపు రెడ్డి బాబి, మోటూరి శ్రీవేణి, కరెడ్ల సూర్య ప్రకాష్, బీజేపీ, టీడీపీ జనసేన కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వి ఆర్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్



**అచ్యుతాపురం, మే 30 (జనస్వరం) :** వి ఆర్ సమ్మర్ క్యాంప్ కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో శ్రీ విష్ణు హాస్పిటల్ సహకారంతో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్రీడాకారులకు శ్రీ విష్ణు డెంటల్ అండ్ కాస్మెటిక్స్ సహకారంతో సుమారు 60 మంది పిల్లలకు వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డా.సుధీర్, డా. మౌనిక, డా.సత్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజుకు రెండు పూటలా బ్రష్ చేసుకోవాలన్నారు. ఏదైనా ఆహార పదార్థం తీసుకున్న అనంతరం నోట్లో నీళ్లు వేసుకుని పుక్కలించుకోవాలని సూచించారు. మంచి ఆహార పదార్థాలు తీసుకోవాలని తెలిపారు. పిల్లలకు వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉన్నారా అని చెక్ చేసి వారికి కావలసిన పౌష్టిక ఆహారాలను సూచించారు. హెయిర్ గురించి తలకి రాత్రి నూనె రాసుకుని ఉదయాన్నే తలంటి స్నానం చేయాలని అన్నారు. వేసవిలో పిల్లలు ఎండలో తిరగకుంట నీడ పట్టున ఉండాలని తెలిపారు. ఈ హెల్త్ క్యాంపులో ముఖ్యంగా డెంటల్, స్కిన్, హెయిర్, బీఎంఐ (బాడీ మజిల్ ఇండికేటర్) పరీక్ష చూసి వాటికి సంబంధించిన మౌత్ వాస్, టూత్ పేస్ట్, బ్రెస్ ఉచితముగా పిల్లలకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు కూండ్రపు నాయుడు బాబు, ఉమా శంకర్, కోచ్ మచ్చ సుబ్రహ్మణ్యం, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఐటీయూ జెండా ఆవిష్కరణ

### యలమంచిలిలో ఫ్యూజన్ బ్రిక్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమం



**యలమంచిలి, మే 30 (జనస్వరం) :** సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని యలమంచిలి ధర్మవరం వీధిలోని ఫ్యూజన్ బ్రిక్స్ కంపెనీ వద్ద శుక్రవారం సీఐటీయూ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ చింతకాయల శివాజీ మాట్లాడుతూ, సీఐటీయూ 1970 మే 31న స్థాపితమై అప్పటినుంచి కార్మిక హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేపట్టిందన్నారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ సమయంలో కూడా సీఐటీయూ కార్మికుల పక్షాన నిలబడి, లాఠీలకు బెదరకుండా ఉద్యమాలు నిర్వహించిందని చెప్పారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం గతంలో కార్మికులు సంవత్సరాల తరబడి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని విమర్శించారు. ఇందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీఐటీయూ పోరాటాలు కొనసాగిస్తోందని, దేశంలో అత్యధిక సభ్యులు కలిగిన కార్మిక సంఘంగా సీఐటీయూనే ఉందని తెలిపారు. కార్మికుల ఐక్యత కోసం సీఐటీయూ అనేక విజయవంతమైన ఉద్యమాలను నడిపిందని శివాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శశికళ, సత్యనారాయణ, చిరంజీవి, లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలో నాసిరక పనులపై విజిలెన్స్ విచారణ జరపాలి

- కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన జనసేన
- ప్రజాధనాన్ని దోచుకోవడం పెద్ద నేరం... మహాపాపం
- పరిపాలనలో పారదర్శకతకు చంద్రబాబు - పవన్ కల్యాణ్‌లు ప్రేరణ
- నాణ్యతా ప్రమాణాలను లంగించిన కాంట్రాక్టర్లు, అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి




**గుంటూరు, మే 30 (జనస్వరం) :** నగరపాలక సంస్థ పరిధిలో వైసీపీ హయాంలో (2021-2024) జరిగిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ఉల్లంఘించిన ఘటనలపై విజిలెన్స్ విచారణ జరిపించాలని కోరుతూ జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి శుక్రవారం కమిషనర్ పులి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గత పాలకుల కాలంలో అధికారాలను దుర్వినియోగం చేస్తూ పబ్లిక్ ఫండ్స్‌ను దోచుకున్న ఘోర అవినీతిని బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ, "ప్రజాధనాన్ని దోచుకోవడం పెద్ద నేరం మాత్రమే కాదు.. మహాపాపం. నాటి పాలకులు, వారి అనుకూల కాంట్రాక్టర్లు అభివృద్ధి పేరిట నాసిరక పనులు చేశారు. ఈ పనులన్నీ ఇప్పుడు ప్రజలకు ప్రాణాపాయంగా మారాయి," అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఒక ప్రాంతంలో చిన్న గాలికే విద్యుత్ స్తంభం కూలిపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. అక్కడ జనసంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని గుర్తుచేశారు. అధికారాలను అడ్డం పెట్టుకుని కోట్లు దోచుకున్న నాయకులు, వారికి సహకరించిన అధికారులపై విచారణ అనంతరం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంతో పరిపాలన కొనసాగుతున్నదని తెలిపారు. ఈ భావజాలాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

**పరిశుద్ధ పాలనకు మకుటం వేయాలి :**
నగర అభివృద్ధిలో ప్రజల నమ్మకాన్ని పొందాలంటే ప్రతి ప్రాజెక్ట్ నాణ్యతా ప్రమాణాలతో జరగాలని, కాంట్రాక్టు పనుల్లో అవినీతి చోటు చేసుకోకూడదని హితవు పలికారు. నూతన కూటమి ప్రభుత్వంలో ప్రతి అభివృద్ధి పనికి పారదర్శకత ఉండాలని, పనుల ప్రాంగణంలో వివరాలతో కూడిన ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

**వారంలోపు నివేదిక సిద్ధం చేస్తాం : కమిషనర్ స్పందన**
ఈ అంశంపై స్పందించిన గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్, నాసిరకంగా జరిగిన పనులపై ఓ వారంలోగా నివేదిక సిద్ధం చేయాలంటూ సంబంధిత అధికారులకు ఇదివరకే ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. నివేదికపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర నాయకులు మెహబూబ్ బాషా, కోలా అంజి, పడిసపోగు రమేష్, నందూరి స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

- క్షయ రహిత సమాజమే లక్ష్యం
- ని-క్షయ్ సంపర్క్ హెల్ప్ లైన్ 1800-11-6666(టోల్ ఫ్రీ)
- క్షయ వ్యాధి నిర్మూలన పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి




**ఏలూరు, మే 30 (జనస్వరం) :** క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఇంటెన్సిఫైడ్ టి.బి. ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన పోస్టర్లను, కరపత్రాలను కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయన్నారు. క్షయ పోషణ అభియాన్ కింద క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. లక్షణాలు ఉన్నవారు సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకొని మందులు వాడాలని సూచించారు. ప్రధాన మంత్రి టి.బి. ముక్త్ భారత అభియాన్ ప్రోగ్రాం కింద ఎవరైనా సరే క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకొని నిక్షయ్ మిత్రగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందుకోసం ని-క్షయ్ సంపర్క్ హెల్ప్ లైన్ 1800-11-6666 టోల్ ఫ్రీని సంప్రదించవచ్చన్నారు. టి.బి.ని చికిత్స ద్వారానే కాకుండా నివారణ ద్వారా కూడా ఓడించాలన్నారు. నివారణతో సాధ్యమైనపుడు టి.బి. వ్యాధిని ఎందుకు విస్మరించాలన్నారు. ఈ వ్యాధిపై ఉన్న అపోహలు తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పూర్తిగా నయం చేయదగిన వ్యాధి అని ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రస్తుత పరిస్థితిలో ఈ వ్యాధి నిర్ధారణ మరింత సులువుగా మారిందన్నారు. దీనిని వినియోగించుకొని ప్రతికేసును గుర్తించడం ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నిర్మూలించగలమన్నారు. దగ్గుమాత్రమే టి.బి. వ్యాధి లక్షణం కాదని, శారీరక ఆరోగ్యంలో ఆకస్మిక మార్పు తెమడతో కూడిన దగ్గు, తెమడలో రక్తం పడటం, జ్వరం, ఛాతిలో నొప్పి, అలసట, నిరసం, ఏదైనా శరీరభాగంలో గుల్లలు, వాపు రావడం వంటి లక్షణాల కనిపించినట్లయితే సమీప ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డా. ఆర్. మాలిని, డిఐఓ డా. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండాలను తొక్కి పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

### ఇంచార్జ్ బీటెక్ రవి



**పులివెందుల, మే 30 (జనస్వరం) :** మహానాడు కార్యక్రమం సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన టీడీపీ జెండాలను తొక్కి పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో రెండు విగ్రహాలకు అనుమతి ఉందని తెలిపారు. పట్టణ పరిధిలో ఎక్కడ చూసినా ఎలాంటి అనుమతులు లేకుండా మొత్తం 12 విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. మహానాడు సందర్భంగా వైఎస్ఆర్ విగ్రహాన్ని అవమానపరిచేలా తాము జెండాలు ఏర్పాటు చేయలేదన్నారు. జెండాలను తోరణాలను కూడా మహానాడు పూర్తవుగానే తొలగిస్తామని చెప్పామన్నారు. తమ మాట పెడచెవిన పెట్టిన కొందరు వైసీపీ నాయకులు టీడీపీ జెండాలను, పచ్చ తోరణాలను చింపేసి తొక్కిపడేసి నానా రాద్ధాంతం చేశారన్నారు. ఒకవేళ వారికి అభ్యంతరం ఉంటే మున్సిపల్ అధికారులకు తెలియజేయాలని, అలా తెలియజేయకుండా దౌర్జన్యం చేయడం ఎంతవరకు సబబుని బీటెక్ రవి ప్రశ్నించారు. పోలీసులను అడ్డ పెట్టుకుని కొంతమంది వైసీపీ నాయకులు దిగజాడు రాజకీయాలకు పాల్పడుతూ తమపై నింద వేయడం అన్యాయమన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మపై కేసు పెట్టింది ఎవరు..? ఆగే సోదరి షర్మిలమ్మకు ఆస్తి పంచి ఇవ్వకుండా ఇంటి నుంచి గెంటేసింది ఎవరు.. వైయస్ రాజశేఖర్ రెడ్డి రాముడైతే ఆయన తమ్ముడు లక్ష్మణుడు వైఎస్ వివేకానంద రెడ్డిని గొడ్డలితో అతి కిరాతకంగా హత్య చేసింది ఎవరు..? ఇవన్నీ ప్రశ్నిస్తే ఎవరు చేయించారు అన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్నారు. వైఎస్సార్ మీద ఉంటే వీటిపై వైసీపీ నాయకులు ప్రశ్నించాలన్నారు. దుందుడుగు రాజకీయాలకు పాల్పడుతున్న వైసీపీ నాయకులకు కంటే వైఎస్సార్‌పై మాకే ఎక్కువ అభిమానం ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా జెండాలను, తోరణాలను తొక్కి పడేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టిడిపి తరఫున డిమాండ్ చేస్తున్నట్లు బీటెక్ రవి వెల్లడించారు.

## యోగాంధ్రలో డ్వామా సిబ్బంది



**ఏలూరు, మే 30 (జనస్వరం) :** యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమాల్లో డ్వామా సిబ్బంది పాల్గొంటుందని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వెంకట సుబ్బారావు తెలిపారు. యోగాంధ్ర మాస వేడుకల కార్యక్రమాలు శుక్రవారం స్థానిక వట్లూరు టిటిడిసిలో నిర్వహించిన యోగాభ్యాసన కార్యక్రమంలో డ్వామాకు చెందిన పలువురు సిబ్బంది పాల్గొని యోగాభ్యాసనాలు చేశారు. యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, శారీరక, మానసిక ఉల్లాసం, ఒత్తిడి తగ్గించడం వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆయన సూచించారు.

## కాలేటి వాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసింది

### వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి



**పులివెందుల, మే 30 (జనస్వరం) :** కాలేటి వాగు ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం కాలికి వదిలేసిందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామలా రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గంలోని చక్రాయపేట మండల పరిధిలోని కాలేటి వాగు ప్రాజెక్టును శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పులివెందులపై కక్ష పెంచుకున్నారన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయంలో పూర్తయిన అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం తమ పేరు వేసుకొని ప్రచారాలు చేస్తుందని విమర్శించారు. కాలేటి వాగు ప్రాజెక్ట్ గతంలో 0.33 టీఎంసీల నుండి 1.33 టీఎంసీలకు సామర్థ్యం పెంచి ప్రాజెక్ట్ ను నిర్మించారన్నారు. వైసీపీ హాయంలో 90 శాతం పనులు పూర్తయిన మిగిలిన 10 శాతం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేయలేకపోతుందని దుయ్యబట్టారు. కాలేటి వాగు ప్రాజెక్టు పూర్తయితే చక్రాయపేట తో పాటు కుప్పం ప్రాంత రైతులకు కూడా మేలు జరుగుతుందని, హెచ్ఎన్ఎస్ ద్వారా గతంలో కుప్పానికి నీరు అందించామన్నారు. చంద్రబాబుకు రైతులపై ఎందుకు అంత వివక్ష ఎందుకని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ఏ రైతు కూడా సంతోషంగా లేరని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు గతంలో 40 కోట్ల మేరా నష్టపరిహారం అందించామని వెల్లడించారు. పెండింగ్ లో ఉన్న రూ.ఆరు కోట్ల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. కాలేటి వాగు శిథిలావస్థకు వచ్చే పరిస్థితి తీసుకురాకండన్నారు. జగన్ కు అధికారం వచ్చి ఉంటే కాలేటి వాగు ప్రాజెక్ట్ పూర్తయ్యేదని తెలిపారు.

## పునాదులకే పరిమితమైన జడుగూరు పాఠశాల భవనం

### ఏడేళ్లుగా నిలిచిన నిర్మాణం.. చెట్ల కింద చదువుతున్న విద్యార్థులు





**చింతపల్లి, మే 30 (జనస్వరం) :** పాఠశాలలు లేని గ్రామాలు.. చెట్ల కింద బోధన.. ఇది ఏడు దశబ్దాలు పూర్తి చేసుకుని డిజిటల్ యుగంలో కొనసాగుతున్న గ్రామీణ విద్యార్థుల వైఫల్య దృశ్యం. చింతపల్లి మండలానికి చెందిన కుడుముసారి పంచాయతీ పరిధిలోని జడుగూరు గ్రామంలో విద్యార్థులు శాశ్వత భవనం లేక విద్యను చెట్ల కింద అభ్యసించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. సరిగ్గా ఏడేళ్ల క్రితం ఈ గ్రామానికి పాఠశాల భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి పునాదులు వేసిన తర్వాత, పనులను చేపట్టిన గుత్తేదారుడు పనులను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్మాణం అక్కడితోనే ఆగిపోయింది. ఫలితంగా, విద్యార్థులు గాలి, వాన, ఎండ తట్టుకుంటూ చెట్ల కింద బోధన కొనసాగిస్తున్నారు. నిరంతరం ఈ స్థితిలో విద్యను కొనసాగించాల్సి రావడంతో, ఉపాధ్యాయులు కూడా తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. కట్టడం లేకపోవడం వల్ల పాఠశాల పాఠ్యసామగ్రి, రికార్డులు భద్రంగా ఉంచడం కష్టంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఒక్క భవనం లేకపోవడం వల్ల విద్యా ప్రమాణాలు ప్రభావితమవుతున్నాయని, విద్యార్థుల హాజరుపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని వారు చెబుతున్నారు. విద్యకు హక్కు ఉంది అంటున్నారు. కాని భవనం కూడా ఉండాలి కదా...? అంటూ గ్రామస్థులు వాపోతున్నారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఇలా జరిగింది కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణలోకి తీసుకుని నిర్మాణాన్ని పునఃప్రారంభించాలంటూ వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఒక నిర్లక్ష్యంతో విద్యార్థుల భవిష్యత్ బలైంది. అయిన ఎవరికీ బాధ్యత లేదన్న భావన తప్పని రీతిగా ఏర్పడిందని పేర్కొంటున్నారు. ఇటీవల గ్రామస్థులు సంబంధిత అధికారులను కలిసినట్టు సమాచారం. నిర్మాణాన్ని పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రాలు సమర్పించారు. ఈ అంశంపై స్థానిక అధికారులు స్పందించి, నిర్లక్ష్యానికి పాల్పడిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకొని, పునాదులలో నిలిచిపోయిన పాఠశాల భవనం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యోగా డే పనులు పరిశీలన



**యలమంచిలి/రాంబిల్లి, మే 30 (జనస్వరం) :** అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలం కొత్తూరు గ్రామంలో ఉన్న ధన దిబ్బ వద్ద ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన యోగాడే కార్యక్రమానికి సంబంధించిన పనులను వేగవంతం చేయడం కొరకు మండల ఏపీఓ శ్రీనివాస్ తో కలిసి మండల నాయకులు దిన్ బాబు పనులను పరిశీలించారు. యోగా డేలో పాల్గొనే వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా పనులు నిర్వహించాలని కోరారు.

# ఏలూరులో ఘనంగా అహల్యబాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలు

**మహనీయురాలైన రాణి సేవా స్ఫూర్తిని**

**కొనియాడిన బీజేపీ, జనసేన నాయకులు**




**ఏలూరు, మే 30 (జనస్వరం) :** మహాశయురాలైన రాణి అహల్యబాయి హెూల్కర్ త్రిశతాబ్ది జయంతిని పురస్కరించుకుని శుక్రవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఏలూరులోని టొబాకో మర్చంట్స్ కళ్యాణ మండపంలోని జూపల్లి సత్యనారాయణ హాలులో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాణి అహల్యబాయి హెూల్కర్ జీవితాన్ని పురస్కరించుకుని ఆమె చేసిన సేవలకు నివాళులర్పించారు. ఆమె సుసంపన్నమైన పరిపాలన, ధార్మికత, సేవా స్ఫూర్తి, సామాజిక చైతన్యం, ఆలయ పునరుద్ధరణలు, మహిళా సాధికారత కోసం తీసుకున్న చర్యలను ప్రసంగాలలో ప్రముఖులు వివరించారు. రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ అహల్యబాయి జీవితమే సేవకు మారుపేరని, ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయంతో ఈ త్రిశతాబ్ది వేడుకలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఆమె జీవితం మహిళలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ అహల్యబాయి పాలనలో మాల్వా ప్రాంతం శాంతి, అభివృద్ధి పరంగా అగ్రగామిగా నిలిచిందన్నారు. భాన్‌పురాలో పిరంగుల కర్మాగారం స్థాపించడం, తపాలా సేవలను ప్రారంభించడం వంటి ప్రగతిశీల చర్యలు ఆమె దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. ఆమె పేరుతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే "స్త్రీ శక్తి పురస్కారం" దేశంలో మహిళా సాధికారతకు గుర్తింపు అని అన్నారు. ఘంటసాల వెంకటలక్ష్మి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడటంలో అహల్యబాయ్ చేసిన కృషి అపూర్వమని, ఆమె వంటి ఆదర్శమూర్తుల జీవితం ఈనాటి యువతకు మార్గదర్శకమవుతుందని తెలిపారు. ఈ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, జనసేన జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుధాకర్ కృష్ణ, కట్నేని కృష్ణ ప్రసాద్, శరణాల మాలతీ రాణి, జిల్లా కన్వీనర్ కోట ప్రోలు కృష్ణ, మహిళా నేతలు అడపా శోభారాణి, సుభద్ర దేవి, కుసుమ కుమారి, నడపాన వాణి, యువ మోర్చా నాయకులు అడపా సురేష్, భాను ప్రకాష్, ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కూటమి పార్టీల ప్రతినిధులు, అనేకమంది మహిళలు పాల్గొన్నారు.

# ప్రమాదానికి గురైన హెూంగార్డ్‌కు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పరామర్శ



**చిలకలూరిపేట, మే 30 (జనస్వరం) :** చిలకలూరిపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెూంగార్డ్ శ్రీనివాసరావు, అతని కుమారుడు ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో, శుక్రవారం పండరిపురం ప్రాంతంలో ఉన్న వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారిని పరామర్శించారు. శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులను ప్రోత్సహిస్తూ మాట్లాడిన ఎమ్మెల్యే పుల్లారావు, తాము ఎప్పటికీ ప్రజలతో ఉండి, వారికి అండగా నిలవాలని తమ పార్టీ నమ్మకంగా విశ్వసిస్తుందన్నారు. ప్రమాదంలో గాయపడిన కుటుంబానికి అవసరమైన సాయాన్ని అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్, మద్దుమాల రవి, రాయని శ్రీను, పలువురు వార్డ్ నాయకులు పాల్గొని పరామర్శ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

# శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం చేస్తాం

**పరిశీలనలో తుడా చైర్మన్**



**తిరుపతి, మే 30 (జనస్వరం) :** తిరుపతి అర్బన్ మండల పరిధిలోని శెట్టిపల్లి భూముల సమస్యలను త్వరలోనే పరిశీలించి పరిష్కరిస్తామని "తుడా" చైర్మన్ "డాలర్స్" దివాకర్ రెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం శెట్టిపల్లి భూములను చైర్మన్ సి.దివాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎన్.మౌర్య తుడా, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. 10 సంవత్సరాలుగా రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రైతులకు, సైట్లు కొనుగోలు చేసిన వారికి ఎక్కడ ఇవ్వాలనే విషయాలపై చర్చిస్తున్నామన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే సర్దుకుని ముందుకు వెళ్లేందుకు సహకరించాలని కోరారు. వేల కుటుంబాలు ఆధారపడి ఉన్న శెట్టిపల్లి భూములను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తరపున ఈ భూములను అభివృద్ధి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో త్వరగా రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించి, మహా నగరంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. తుడా తరపున ఇంత త్వరగా అభివృద్ధి చేశారా అనేలా చేస్తామన్నారు. ఈ పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, సర్వేయర్లు దేవానంద్, కోటేశ్వర రావు, పలువురు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# మహానాడు సూపర్ సక్సెస్... శ్రేణుల్లో జోష్


**టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర**



**తిరుపతి, మే 30 (జనస్వరం) :** కడపలో నిర్వహించిన మహానాడు - 2025 అత్యంత విజయవంతం అయిందని.. అదుర్స్ అని.. సూపర్ సక్సెస్‌తో పార్టీ శ్రేణుల్లో జోష్ నిండిపోయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్ర కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మహానాడు మొదటి రెండు రోజులలో జరిగిన ప్రతినిధుల సభలో 25 వేలకు పైగా పార్టీ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. మూడో రోజు పార్టీ బహిరంగ సభలో ఆశించిన సంఖ్య కంటే ఎక్కువగా సుమారు 6లక్షలకు పైగా పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారన్నారు. ఈ మహానాడు రాయలసీమ పార్టీ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. నారా లోకేష్ స్వీయ పర్యవేక్షణలో మహానాడు అద్భుతంగా, అన్ని సౌకర్యాలతో, ఖచ్చితత్వంతో, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా జరిగిందని తెలిపారు. ఈ మహానాడు-2025 తెలుగుదేశం పార్టీకి, రాష్ట్రానికి దిశ దశ చూపించిందని సురేంద్ర కుమార్ వెల్లడించారు. జగన్ పాలనలో సర్వ నాశనం అయిన రాష్ట్రాన్ని తిరిగి గాడిలోకి తెచ్చేవిధంగా, రాష్ట్ర పునర్నిర్మాణానికి దిశా దశ, మార్గ సూచిక ఇచ్చిందన్నారు. పార్టీ మరో 40 ఏళ్ళు పటిష్టంగా ఉండటానికి నారా లోకేష్ సూపర్ సిక్స్ శాసనాలను మహానాడు ముందు ఆమోదింపచేసి పార్టీకి నూతన శక్తికి మార్గం చూపారని అభినందించారు. ప్రభుత్వానికి ప్రజలే ప్రాధాన్యత, పార్టీకి కార్యకర్తే ప్రాధాన్యత అని స్పష్టం చేసింది ఈ మహానాడు అని చెప్పారు. ఆర్థిక ఉగ్రవాదులు చేసిన పాపాలకు, నష్టాలకు, అరాచకాలు చట్టబద్ధంగా శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

# తిరుమల భద్రతలో మెరుగైన వ్యవస్థ తెస్తాం

**టీటీడీ ఈఓతో ఉన్నతస్థాయి సమీక్షలో డీజీపీ**



**తిరుపతి, మే 30 (జనస్వరం) :** అంతర్జాతీయ స్థాయిలో తిరుమలకు ఉన్న ప్రత్యేకత నేపథ్యంలో మెరుగైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేయడం అవసరమని ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరిష్ కుమార్ గుప్తా సూచించారు. తిరుమలలో ఇప్పుడు అమలవుతున్న భద్రతను ఏ విధంగా మరింత బలోపేతం చేయాలనే అంశంపై టీటీడీ ఈఓ శ్యామల రావు సమక్షంలో శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో ఉన్నత స్థాయి భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభంలో ముందుగా తిరుపతి ఎస్పీ కమ్ టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వో హర్షవర్ధన్ రాజు భద్రతా అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హెూంగార్డు, సివిల్ పోలీసు, టీటీడీ సెక్యూరిటీతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. వివిధ సెక్యూరిటీ ఏజెన్సీలకు స్థిరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించాలని సూచించారు. అలిపిరి వద్ద బహుళ స్థాయి వాహన తనిఖీ వ్యవస్థ, డిఫెన్స్ ఏజెన్సీలతో కలసి సెన్సార్ ప్లే సిస్టమ్, ఆధునిక భద్రతా పరికరాలు, సైబర్ భద్రత వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై కూడా ఆయన చర్చించారు. అనంతరం టీటీడీ ఈవో శ్యామల రావు మాట్లాడుతూ భద్రతపై అనుబంధ ఏజెన్సీలతో ఒక సమన్వయ వ్యవస్థ అవసరమని అభిప్రాయ పడ్డారు. తిరుమలలో సైబర్ భద్రతా వ్యవస్థను మరింతగా బలోపేతం చేయాలని పేర్కొన్నారు. విస్తృత స్థాయిలో తిరుమల భద్రతా సమీక్ష నిర్వహించడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్ సుధాకర్ రెడ్డి, అడిషనల్ డీజీ ఇంటలిజెన్స్ మహేష్ చంద్ర లడ్హా, అనంతపురం రేంజ్ డీఐజీ డా.శేముషి, ఐఎస్ డబ్ల్యూ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, డీఎఫ్ఓ వివేక్ ఆనంద్, వివిధ భద్రతా బలగాల అధికారులతో పాటు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, టీటీడీ నిఘా - భద్రత అధికారులు, వివిధ విభాగాల టీటీడీ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# అన్నమయ్య డ్యామ్ బాధితులకు న్యాయం చేస్తాం

**జనసేన నాయకుడు యల్లటూరు శ్రీనివాస రాజు**



**రాజంపేట, మే 30 (జనస్వరం) :** నియోజకవర్గం పరిధిలోని తొగురుపేట, మందపల్లె, పులప త్తూరు, హరిజనవాడ గ్రామాల్లో అన్నమయ్య డ్యామ్ విపత్తు బాధితులను పరామర్శించేందుకు జనసేన పార్టీ శ్రేణులు పర్యటించాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, నేతలు అతికారి కృష్ణ, ఇతర నాయకులు, జనసైనికులు, వీరమహిళ లు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యల్లటూరు శ్రీనివాస రాజు మాట్లాడుతూ "అన్నమయ్య డ్యామ్ విషాదం రాష్ట్రాన్ని కలచివేసిన ఘోర ఘటనగా చరిత్రలో నిలిచిపోయింది. బాధితులకు తగిన పునరావాసం కల్పించడంలో గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇప్ప టికీ ప్రజలు ఎన్నో సమస్యలతో బాధపడుతున్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన మన కూటమి ప్రభుత్వం బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తోంది," అని అన్నారు. జనసేన అధి నేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనో హర్ పర్యవేక్షణలో, నేడు అన్నమయ్య డ్యామ్ పరిధిలోని బాధిత గ్రామాల్లో పునరావాసం, హౌసింగ్, రహదారులు, తాగునీటి సమస్య, విద్యుత్ తదితర మౌలిక వసతుల ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించామని, దీనిపై రూపొందించిన నివేదికలను ఉప ముఖ్యమంత్రికి సమర్పించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# ఘనంగా మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి వేడుకలు



**నంద్యాల, మే 30 (జనస్వరం) :** పట్టణంలోని సంజీవనగర్‌లో ఉన్న రామాలయంలో శుక్రవారం మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి వేడుకలు భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా జరిగాయి. ఆలయ పాలకవర్గం మహాసంకల్పంతో ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించింది. చల్లని వాతావరణంలో వేలాది మంది భక్తులు ఈ వేడుకలకు హాజరయ్యారు. స్వర్ణోత్సవ సందర్భంగా నిర్వహించిన ఈ మహెూత్సవంలో శివాలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ, సిద్ధి బుద్ధి సమేత మహాగణపతి చలప్రతిష్ఠ, 1236 కళశాలతో సహస్ర ఘటాభిషేకం వంటి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయంలోని అన్ని ప్రధాన దేవాలయాలు, ఉప ఆలయాలు, పరివార దేవతలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో పాటు 14 శిఖర కళశాలకు ప్రత్యేకంగా పూజలు జరిపారు. ఈ మహా ఘట్టానికి పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు శ్రీ విద్యాశంకర భారతి మహాస్వామి నేతృత్వం వహించారు. మహాస్వామి స్వయంగా రాజగోపురం శిఖర కళశాలకు అభిషేకం చేసిన వెంటనే వర్షం ప్రారంభమవడం విశేషం. స్వామివారి ప్రోక్షణ తరువాత వెంటనే వరుణ దేవుడు తుంపర్ల వర్షంతో కురవడం భక్తులను భావోద్వేగానికి గురిచేసింది. ఈ అద్భుత సంఘటన ఆలయ ప్రాంగణాన్ని "జై శ్రీరాం" నినాదాలతో మార్మోగిపోయేలా చేసింది. వేడుకల్లో భాగంగా ఆలయ పాలకవర్గం సభ్యులు ప్రతి భక్తునికి స్వామివారి ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలను తిలకించారు.

# మల్లుల అనురాధ మృతి.. సీపీఐ, అరసం, మహిళా సమాఖ్యకు తీరని లోటు

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్**



**ఏలూరు, మే 30 (జనస్వరం) :** సీపీఐ జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాసరావు సతీమణి, అరసం జిల్లా సమితి సభ్యురాలు, న్యాయవాది మల్లుల అనురాధ మృతి సిపిఐ,అరసం, మహిళా సమాఖ్యకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ శుక్రవారం సంతా పం వ్యక్తం చేశారు. అనురాధ సీపీఐ సభ్యురాలుగా అరసం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సభ్య రాలుగా ఉంటూ ఆయా సంఘాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తూ పార్టీ, ప్రజా సంఘాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. అనురాధ వామపక్ష భావజాలంతో అనేక కార్యక్రమాల్లో పాల్గొని ముందుండేవారన్నారు. పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొంటున్న అనురాధ ఆకస్మికంగా మృతి చెందడం విచారకరమని, ఆమె మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

# కూటమి పాలనలో పంట పొలాలన్నీ సస్యశ్యామలం

**ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి**





**దెందులూరు, మే 30 (జనస్వరం) :** మండలంలోని సత్యనారాయణపురం వద్దగల గోదావరి కాలువ పూడికతీత పనులను శుక్రవారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్థానిక నీటి సంఘం అధ్యక్షులు, సభ్యులు, స్థానిక కూటమి నాయకులు మరియు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో పంట కాలువలకు సంబంధించి పూడికతీత పనులు, గేట్ల మరమ్మతులు గాని, నూతన గేట్ల ఏర్పాట్లు గాని చేయకుండా ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అనేక అంశాలను నిర్లక్ష్యం చేయడం వలన రైతులకు సాగునీరు అందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన చర్యల వలన రైతులకు పంటలు సస్యశ్యామలంగా అందుతున్నాయని, అదేవిధంగా రాబోయే సీజన్లో రైతులకు సాగునీరు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండటం కోసం గోదావరి కాలువలో పూడికతీత సహా పలు మరమ్మత్తు పనులు చేపట్టడం జరిగిందని, త్వరితగతిని ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.

# శ్రీశైలంలో నేడు రాజమాత అహల్యా బాయ్ హెూల్కర్ జయంతి వేడుకలు

**కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ పాల్గొననున్నాయి**




**నంద్యాల, మే 30 (జనస్వరం) :** భారతదేశ చరిత్రలో విశిష్ట స్థానం కలిగిన రాజమాత అహల్యా బాయ్ హెూల్కర్ జయంతి వేడుకలు శుక్రవారం శ్రీశైలంలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థాన పరిధిలోని కళ్యాణ మండపంలోని సదన్ హాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో, బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల పట్టణ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్య అచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "చిన్న వయసులోనే భర్తను కోల్పోయినా, దేశ రాజకీయాలపై విశిష్ట ప్రభావం చూపిన అహల్యా బాయ్ హెూల్కర్ అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఆమె చేసిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికీ ప్రేరణగా నిలుస్తున్నాయి" అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ జాతీయ కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకురాలు కొంపల్లి మాధవి లత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి బిట్రా వెంకట శివనారాయణ, జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్ నాయుడు తదితరులు హాజరుకానున్నారు. జిల్లా నలుమూలల నుంచి బీజేపీ నేతలు, వివిధ మోర్చాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొననున్నారు. అహల్యా బాయ్ యొక్క గొప్పదనాన్ని స్మరించేందుకు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళి అర్పించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# ప్రజలకు అవసరమైనదే చేయాలి

**- మంత్రి నారాయణ**

**- నెల్లూరు నగర అభివృద్ధిపై సమీక్ష సమావేశం**



**నెల్లూరు, మే 30 (జనస్వరం) :** ప్రజల ఆకాంక్షల మేరకు నగర అభివృద్ధి పనులు ముందుకు సాగాలని, అధికారులంతా అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేలా పని చేయాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో నగరపాలక సంస్థ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్ష సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, "తనపై నమ్మకంతో ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. వారు కోరుకునే అభివృద్ధి, సేవలే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తున్నాం. నగరాన్ని అన్ని విధాలా శ్రేష్ఠంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం" అని అన్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారుల నుంచి నివేదికలు స్వీకరించిన మంత్రి, ప్రధానంగా వర్షాకాలం నేపథ్యంలో తగిన ముందు జాగ్రత్త చర్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. నగరంలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి, కాలువలు, డ్రెయినేజీలను శుభ్రం చేసి నిరంతర ప్రవాహాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. ప్రజల అవసరాలు ముందుగా గుర్తించి కార్యాచరణ రూపొందించాలనే దిశగా నగర పాలన కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. సమావేశం ముగిసిన అనంతరం మంత్రి నారాయణ అధికారులతో కలిసి పలు అభివృద్ధి ప్రదేశాల సందర్శనకు వెళ్లే అవకాశముందని సమాచారం.

# పులివెందులలో వైసీపీకి గట్టి షాక్

- సైకిలెక్కిన ఫ్యాన్ అభిమానులు
- సాధరంగా ఆహ్వానించిన బీటెక్ రవి



**పులివెందుల, మే 30 (జనస్వరం) :** పట్టణంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఫ్యాన్‌కు చెందిన పలు కుటుంబాలు శుక్రవారం సైకిలెక్కారు. పార్టీలో చేరిన వారిని పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. స్థానిక సరస్వతీ విద్యా మందిరం వెనుక ఉన్న అయిషా మజీద్ వీధిలో నివాసం ఉంటున్న షేక్. భాషా (వేల్పుల భాషా) వారి కుటుంబాలు అతని అనుచరుల సభ్యులు రఫీ, వల్లి, మాబాషా, షబ్బీర్, భాషా, బాబా వల్లి, హారీష్, మహమ్మద్, కరీముల్లా, సత్తార్, ఇమాంబి, సాధాకున్, మున్ని, షబానా, ఖాజాబీ, గౌసియా, తస్లీమ్ లతో కలిసి వైస్సార్సీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి. రవీంద్ర నాథ్ రెడ్డి, రాష్ట్ర హౌ జ్ కమిటీ డైరెక్టర్ షేక్.మహబూబ్ బాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం వల్లి లు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి అహ్మనిచ్చారు. అనంతరం బీటెక్. రవి మాట్లాడుతూ వార్డులో ఉన్న సమస్యలని పరిష్కరించే దిశగా వార్డ్ డెవలప్ కోసం కష్టపడి వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలన్నారు. టీడీపీ పార్టీ లో కొత్తగా చేరినటువంటి వేల్పుల భాషా తో పార్టీ లో చురుగ్గా పని చేయాలనీ కష్టానికి తగ్గ ఫలితం ప్రతి ఒక్కరికి దక్కు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

## 4న విజయవాడ పశ్చిమలో "వెన్నుపోటు దినం" నిరసన కార్యక్రమం

**వైసీపీ నేతల సమావేశంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పిలుపు**



**విజయవాడ, మే 30 (జనస్వరం) :** వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో "వెన్నుపోటు దినం" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి, వైసీపీ విజయవాడ పశ్చిమ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ పశ్చిమలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న పార్టీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో గురువారం సమావేశం నిర్వహించిన ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ "ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కుట్రలపై ప్రజలకు బహిరంగంగా తెలియజేసే ఉద్దేశంతో ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నాం. ప్రతి నాయకుడు, కార్యకర్త ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని విజయవంతం చేయాలి" అని పిలుపునిచ్చారు. ప్రజల్లో ఈ కార్యక్రమం పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి, వారికి వాస్తవాలు వివరించాలని సూచించారు. ఈ నిరసన కార్యక్రమం ద్వారా వైసీపీపై జరిగిన అన్యాయాన్ని సమాజానికి స్పష్టంగా తెలియజేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెలంపల్లిని కలిసిన కేసరి కృష్ణా రెడ్డి, దొడ్డ రాజశేఖర్ రెడ్డి

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించిన మాజీ మంత్రి**



**విజయవాడ, మే 30 (జనస్వరం) :** వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావును శుక్రవారం స్థానిక బ్రాహ్మణ వీధిలోని వైసీపీ పశ్చిమ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి కేసరి కృష్ణా రెడ్డి, రాష్ట్ర ఐటీ విభాగం కార్యదర్శి దొడ్డ రాజశేఖర్ రెడ్డి కలిసి మర్యాద పూర్వకంగా అభినందనలు తెలిపారు. ఇటీవల పార్టీ పక్షాన వీరికి రాష్ట్రస్థాయి పదవులు లభించిన నేపథ్యంలో వెలంపల్లి శ్రీనివాసరావుతో భేటీ అయ్యి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి వారు వారికి శాలువా కప్పి సన్మానించారు. పార్టీ బలోపేతానికి ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన బాధ్యతలపై మార్గదర్శనం ఇచ్చిన ఆయన, ప్రతి బూత్ స్థాయిలో పార్టీకి మద్దతు పెంపు, ఐటీ విభాగం ఆధునీకరణ తదితర అంశాల్లో చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలతో మమేకమవ్వండి

- ప్రభుత్వ కార్యక్రమాలపై నిరంతర చర్చ
- త్వరలో సంక్షేమ క్యాలెండర్ ప్రకటన: సీఎం



**అమరావతి, మే 30 (జనస్వరం) :** 'ప్రజలతో నాయకులు మరింత మమేకం కావాలని.. తద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చ జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తాను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి కారణం కూడా అదేనని.. ఎమ్మెల్యేలు కూడా విధిగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. మహానాడులో ప్రవేశ పెట్టిన 'నా తెలుగు కుటుంబం'లోని ఆరు శాసనాలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, గ్రామ స్థాయి నాయ కులతో చంద్రబాబు శుక్రవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కడప మహానాడును విజ యవంతం చేసిన కడప జిల్లా నాయకత్వానికి, రాష్ట్ర స్థాయి నేతలకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. నాయకత్వం సమష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని కడప మహానాడుతో నిరూపితమైందన్నారు. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని అభినందించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసేలా పాలన సాగుతోందని, ఏడాదిలో మనం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై వారిలో సానుకూలత ఉందని తెలిపారు. 'ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో.. రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించాం. జూన్‌లో తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ ప్రారంభిస్తాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నాం. సంక్షేమ క్యాలెండర్‌ను త్వరలో ప్రకటిస్తాం' అని సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఢిల్లీలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్న నేపథ్యంలో ఆయన శుక్రవారం సీఎంను ఆయన అధికారిక నివాసం వన్ జనపథ్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంద కృష్ణను, చంద్రబాబు అభినందించారు. వర్గీకరణ ఉద్యమ ప్రస్థానాన్ని గురించి ఇరువురు నేతలు గుర్తు చేసుకున్నారు.

## మహానాడు వైఎస్ కుటుంబానికి చెంపపెట్టు



**కడప మారుతీనగర్, మే 30 (జనస్వరం) :** 'వైఎస్ కుటుంబానికి కడప జిల్లా కంచుకోట అని ప్రగల్భాలు పలికే వైసీపీ ఉత్తర కుమార నాయకులకు చెంప పెట్టులా... కడపలో మహానాడు అద్భుతంగా జరిగింది. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన మహానాడులు అన్నింటినీ మించి కడప మహానాడు విజయవంతం అయింది' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఇక్కడ పాత్రికేయుల సమావేశంలో ఆయన మంత్రులు, ఎంఎల్‌సీలు, ఎమ్మెల్యేలతో కలసి మాట్లాడారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి సంవత్సరం అవుతోంది. ప్రజలకు సీఎం చంద్రబాబు పట్ల అపారమైన నమ్మకం ఉందని మహానాడు సభ నిరూపించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ప్రతిపాదించిన ఆరు శాసనాలు భవిష్యత్తులో పార్టీని బంగారు బాటలో నడిపించేందుకు ఎంతగానో దోహదపడతాయి. మహానాడును విజయవంతం చేసిన ఉమ్మడి కడప జిల్లా పార్టీ నాయకులకు, ప్రత్యేకించి కార్యకర్తలు, ప్రజలు, అభిమానులకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు' అని పల్లా అన్నారు.

## మహానాడు విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

**ఎంపీ వేమిరెడ్డి**



**నెల్లూరు, మే 30 (జనస్వరం) :** కడపలో ముగిసిన తెలుగుదేశం పార్టీ మహానాడును విజయవంతం చేసిన ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. మూడు రోజుల పాటు (మే 27–29) ఘనంగా జరిగిన మహానాడు అన్ని విధాలా సాఫల్యాన్ని అందుకుందంటూ, పార్టీలో కార్యకర్తలకు ఇచ్చే ప్రాధాన్యత మరోసారి స్పష్టమైందన్నారు. మహానాడులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరిగి పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ప్రత్యేక సంతోషానికిచ్చిందని ఎంపీ పేర్కొన్నారు. యువ నేత నారా లోకేష్ చేసిన ప్రసంగం యువతలో ఆత్మవిశ్వాసం నూరి పోసిందని, నాయకత్వానికి సరైన దిశగా సూచనలు, ప్రేరణ ఇచ్చిందని కొనియాడారు. "ఈ మహానాడులో తొలిసారి ఎంపీగా పాల్గొనడం నాకు ఎనలేని గౌరవాన్ని, ఆనందాన్ని కలిగించింది," అని వేమిరెడ్డి అన్నారు. రానున్న రోజుల్లో కూడా అదే ఊపు, అదే స్ఫూర్తితో పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహానాడు విజయవంతం కావడంలో రవాణా, వసతి, భోజనం సహా ప్రతి విభాగం సమన్వయంతో పని చేయడం వల్లే ఈ స్థాయి విజయాన్ని సాధించగలిగామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేశారని, వారి అందరి సహకారానికి తాను రుణపడి ఉన్నట్లు స్పష్టం చేశారు. "పార్టీ అధినేత ఆదేశాలకు కట్టుబడి ప్రభుత్వ పరంగా, రాజకీయంగా మరింత శ్రేష్ఠత సాధించేందుకు కృషి చేస్తాం," అని ఎంపీ వేమిరెడ్డి వెల్లడించారు.

## మహానాడు ఘన విజయానికి ప్రత్తిపాటి పుల్లారావు కీలక పాత్ర

**చిలకలూరిపేట, మే 30 (జనస్వరం) :** టీడీపీ మహానాడు ఘన విజయం సాధించడంలో మాజీ మంత్రి, టీడీపీ శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాత్ర ఎంతగానో ఉందని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. క్రమశిక్షణతో, సమన్వయంతో ఆయన చేసిన పర్యవేక్షణ వల్లే రాజంపేట నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ జరిగిందన్నారు. రాజంపేట పార్లమెంట్ ఇంచార్జిగా ఉన్న చామర్తి జగన్మోహన్ రాజుతో కలిసి, మహానాడు సందర్భంలో పార్టీ ఏర్పాటు చేసిన భారీ జనసమీకరణ కార్యక్రమాన్ని ప్రత్తిపాటి పుల్లారావు పర్యవేక్షించారు. ఆయన ఆదేశాల మేరకు మండలాల వారీగా నాయకులను నియమించి సమన్వయం సాధించిన తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ప్రత్తిపాటి పర్యవేక్షణలో జీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు (నందలూరు మండలం), తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా (రాజంపేట రూరల్), ఐటీడీపీ నాయకుడు మారెళ్ళ అప్పారావు (వీరబల్లి), లీగల్ సెల్ నాయకుడు ఎం. వెంకటరావు (సుండుపల్లి), చిలకలూరిపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ సమద్ ఖాన్ (సిద్దవటం), సీనియర్ నేత మురుకొండ మల్లిబాబు (రాజంపేట అర్బన్), క్లస్టర్ ఇంచార్జ్ ముల్లా కరీముల్లా (ఒంటిమిట్ట) లు ఆయా మండలాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ ఎనిమిది మంది ఇంచార్జ్‌లు స్థానిక టీడీపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ రాజంపేట నియోజకవర్గం నుంచే సుమారు 35 వేల మందిని మహానాడుకి తరలించడంలో కీలక పాత్ర పోషించారు. "క్రమశిక్షణతో, ఒక్కదిశగా కృషి చేస్తేనే మహానాడు లాంటి ఘన కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నదానికి ఇది ఉదాహరణ" అని మహానాడుకు హాజరైన నాయకులు అభిప్రాయపడ్డారు. జనసమీకరణలో ప్రత్తిపాటి పుల్లారావు చూపిన చొరవ, నాయకత్వం పార్టీకి మరింత శక్తినిచ్చిందని పేర్కొన్నారు.

## మహానాడు విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు

**టీడీపీ నాయకుడు చింతల శ్రీనివాసులు**



**నెల్లూరు, మే 30 (జనస్వరం) :** టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని వైభవంగా విజయవంతం చేయ డంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించారని, వారి ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు సీతారామపురం మండల టీడీపీ కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు. కడపలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహానాడు పండుగ వాతావరణాన్ని సృష్టించిందని, ఈ విజయానికి సీతారామపురం మండల క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల సేవలు అనతరానివని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ పట్ల నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తున్న కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మహానాడు నుండి అందుకున్న స్ఫూర్తితో పాత, కొత్త నాయ కులు కలిసి ఐకమత్యంతో పార్టీ బలోపేతానికి పనిచేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా మహానాడు కార్యక్రమానికి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూస్తే, స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సీతారామపురం మండలంలో టీడీపీ విజయమొస్తుందన్న నమ్మకం కలుగుతోందని పేర్కొన్నారు. పార్టీ కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపునిచ్చే విధంగా తాను కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముత్తంశెట్టి చెన్నకేశవులు, నేలటూరి జాషువా, జెసీ ఇజ్రాయిల్, కానాల సిద్దయ్య, పసుపులేటి వికాస్, అప్పని శ్రీను తదితర నాయకులు పాల్గొన్నారు.

## సీఎం సమయం ఇవ్వలేదనడం సరికాదు

**బొప్పరాజుపై రెవెన్యూ అధికారుల సంఘం ధ్వజం**

**విజయవాడ(గాంధీనగర్), మే 30 (జనస్వరం) :** సీఎం చంద్రబాబు ఉద్యోగ సంఘాలకు అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు చేసిన వ్యాఖ్యలను ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు శుక్రవారం ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేత సూర్యనారాయణ, తమ సంఘం ప్రతినిధులు అనేకసార్లు సీఎంను కలిశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఎన్జీవో అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, బొప్పరాజు ఉద్యోగులకు నష్టం కలిగించారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సుమారు రూ.25వేల కోట్ల బకాయిలు పెట్టడాఇకి కారణం మీరుకాదా? అని ప్రశ్నించారు. గతంలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, వారికి రావాల్సిన బకాయిల గురించి మాట్లాడకుండా ప్రభుత్వ పెద్దలు చెప్పింది విని వారికి భజన చేశారని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన ఉద్యోగుల ప్రతి సమస్యనూ దశల వారీగా తీరుస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించడంపై రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా కొనసాగుతున్న యోగాంధ్ర శిక్షణా శిబిరం



**యలమంచిలి, మే 30 (జనస్వరం) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో నిర్వహిస్తున్న యోగాంధ్ర శిక్షణా శిబిరం ప్రాభవంగా కొనసాగుతోంది. జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించి, అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నట్లు యోగా గురువు మల్ల రామ సూర్య అప్పారావు (రాము) తెలిపారు. ఈ శిబిరంలో సచివాలయం, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక యోగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి" అని పేర్కొన్నారు. యోగ అనేది భారతదేశపు ప్రాచీన సంప్రదాయం నుండి పుట్టిన ఆధ్యాత్మిక విజ్ఞాన శాస్త్రం అని ఆయన వివరించారు. యోగా ద్వారా శరీరం, మనసు, ఆత్మ మమేకమై విజ్ఞానం, మోక్షం సాధ్యమవుతాయని అన్నారు. యోగ సాధన ద్వారా వాతావరణ మార్పులకు శరీరాన్ని సరిపోల్చుకోవడం, వ్యాధి నిరోధక శక్తి పెంపుదల, జీవనశైలి వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని వెల్లడించారు. యోగ కేవలం వ్యాయామం కాదని, అది జీవన విధానమని, మన చేతనను విశ్వ చేతనతో ఐక్యం చేయడమే యోగ లక్ష్యం అని వివరించారు. సంస్కృతంలో "యోగ" అనే పదం "యుజ్" అనే మూలధాతువుతో పుట్టిందని, దాని అర్థం సమ్మేళనం అని తెలిపారు. "మనిషి ప్రకృతితో మమేకం కావడం, సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక శాంతిని కలిగించడమే యోగం సారాంశం" అని రాము గురువు స్పష్టం చేశారు. ఈ శిక్షణ శిబిరం ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందే అవకాశముందని తెలిపారు.

## ఎమ్మెల్యేచే నీళ్ల ట్యాంకులు ప్రారంభం



**తిరుపతి, మే 30 (జనస్వరం) :** స్థానిక ఇందిరా ప్రియదర్శినీ కూరగాయల మార్కెట్‌లో వాటర్ ట్యాంక్‌లను ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు ప్రారంభించారు. మార్కెట్‌లో మౌలిక సదుపాయాలను మరింత మెరుగు పరుస్తామని ఆయన చెప్పారు. శుక్రవారం సాయంత్రం కూరగాయల మార్కెట్‌లో కాంట్రాక్టర్ అన్నారెడ్డి యువరాజ్ రెడ్డి ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంక్ లను ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు ప్రారంభించారు. మార్కెట్ కు వచ్చే వారికి ముఖ్యంగా రైతులకు, కూలీలకు, కొనుగోలుదారులకు తాగునీటి సమస్య వాటర్ ట్యాంకుల ఏర్పాటుతో పరిష్కారమైందని ఎమ్మెల్యే చెప్పారు. మార్కెట్‌లో స్ట్రీట్ లైట్స్, టాయిలెట్స్ ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రోడ్డుపై వ్యాపారం సాగిస్తున్న చిరువ్యాపారులకు షెడ్స్ ఏర్పాటు చేసే అంశం కార్పోరేషన్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. వ్యాపారం ఎలా సాగుతోంది, కూరగాయల ధరలు ఏవిధంగా ఉన్నాయని వ్యాపారస్థులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ ఎస్ కే బాబు, అన్నారెడ్డి కృష్ణారెడ్డి, జానకిరామి రెడ్డి, దొరైరాజ్, రాజా రెడ్డి, విఆర్ వాసు, విఎస్ బాలాజీ, ఆకేపాటి సుభాషిణి, బండ్ల లక్ష్మీపతి, బాలిశెట్టి కిషోర్, వినోద్ రాయల్, పొటుకూరి ఆనంద్, భాను తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు వేదికగా టీడీపీకి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి రూ.10 లక్షల విరాళం



**పుట్టపర్తి, మే 30 (జనస్వరం) :** పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, టీడీపీకి తన వంతుగా రూ.10 లక్షల విరాళాన్ని ప్రకటించి, ఆ చెక్కును పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబుకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమం కడపలో ఘనంగా జరిగిన మహానాడు సభ వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డితో పాటు, పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ పట్ల తనకున్న నిబద్ధతకు గుర్తుగా ఈ విరాళాన్ని ప్రకటించినట్లు ఆమె తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యకలాపాలకు, బలోపేతానికి నిధులవసరం ఉండగా, నాయకులు స్వచ్ఛందంగా విరాళాలు అందించడాన్ని పార్టీ అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు.